



తిరుచానూరు పద్మావతీ అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో చివరిరోజు శుక్రవారం మధ్యాహ్నం పంచమితీర్థం(చక్రస్నానం) భక్తజన ప్రవాహం నడుమ మంగళప్రదంగా జరిగింది. అమ్మవారు పుట్టిన తిథిగా భావించే కార్తీక మాసం శుక్లపక్ష పంచమి రోజున పద్మసరోవరంలో పంచమితీర్థఉత్సవం నిర్వహిస్తారు.
ఈ సమయంలో పుష్కరిణిలో స్నానమాచరిస్తే మంచిజరుగుతుందనే నమ్మకంతో జనం పోటెత్తారు. అయితే తమిళనాడు నుంచి ఏటా భారీగా వచ్చే భక్తులు, ఈసారి వానల వల్ల కొంత తగ్గినట్లుగా కనిపించింది. రాత్రి 9.30 గంటలకు ధ్వజావరోహణంతో అమ్మవారి బ్రహ్మోత్సవాలు ముగిశాయి.

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి



శాస్త్రోక్తంగా ధ్వజావరోహణం

రాత్రి 9.30 నుంచి 11.00 గంటల మధ్య ఆలయంలోని ధ్వజస్తంభం వద్ద అర్చకులు ప్రత్యేక పూజాదికార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ధ్వజారోహణం రోజున ఎగురవేసిన గజపటాన్ని అవరోహణం చేశారు. ఉత్సవాల నిర్వహణకు ఆహ్వానించిన సకల దేవతలను, అష్టదిక్పాలకులకు బలినివేదన చేసి తిరిగి వారిని యథాస్థానానికి పంపించారు. ఉత్సవాల నిర్వహణలో పాలుపంచుకున్న పాంచరాత్ర ఆగమ పండితులు, అర్చకులను ఉన్నతాధికారులు ఘనంగా సత్కరించి ఆలయ మర్యాదలతో ఇంటికి తీసుకెళ్లి వదిలిపెట్టారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

పంచమికి పోటెత్తిన భక్త జనం

- మరిన్ని బ్రహ్మోత్సవ విశేషాలు 10వ పేజీలో -

రాత్రి బంగారు పద్మంపై పద్మావతి

మధ్యాహ్నం చక్రస్నానం అనంతరం అమ్మవారిని పుష్కరిణికి ఎదురుగా ఉన్న గంగుండ్ర మండపానికి తీసుకొచ్చి కొలువుదీర్చారు. అనంతరం శ్రీవారు పంపిన బంగారు ఆభరణాలతో అమ్మవారిని దివ్యంగా అలంకరించారు. రాత్రి 7.30 గంటలకు అమ్మవారు బంగారు పద్మంపై ఆసీనులై తిరువీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనం ఇచ్చారు.

విజయవంతం

"ఎటువంటి అవాంతరాలు లేకుండా ఈ ఏడాది పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాలు విజయవంతంగా జరిగాయి. పెద్ద సంఖ్యలో భక్తులు వాహనసేవలను, మూలమూర్తిని దర్శించుకున్నారన్నారు. అన్నిశాఖల అధికారుల సమన్వయంతో పనిచేశారు. ఒక ప్రణాళిక ప్రకారం ఉత్సవాలు నిర్వహించడంతో ప్రతిఒక్కరూ వాహనసేవల్లో అమ్మవారికి కర్పూరహారతులు సమర్పించగలిగారు. అన్నప్రసాదాలు, పెద్దఎత్తున అందజేశాం."

- టీటీడీ ఈవో శ్యామలరావు

ఆ ఫుట్‌బాల్ ప్లేయర్ ఎక్కడో?



వెంకటగిరిలో గత ప్రభుత్వం నాపై ఒక ఫుట్‌బాల్ ప్లేయర్‌ని దింపింది. ఇప్పుడా ప్లేయర్ ఎక్కడున్నారోనని మిగిలిన ప్లేయర్లందరూ ఇంకా వెతుకుతూనే ఉన్నారు. ఇకపై వెంకటగిరిలో ఫుట్‌బాల్ ప్లేయర్లు కనిపించరు. కురుగొండ్ల రామకృష్ణ లేదంటే మంత్రిగా నేను మాత్రమే కనిపిస్తాం. ఈ నియోజకవర్గంలోని ఏ ప్రాంతం ఏ జిల్లాలో ఉందో తెలుసుకొనేలోపే ఐదేళ్లు ముగిశాయి.

- ఆనం రామనారాయణరెడ్డి, దేవదాయశాఖ మంత్రి

జనం చెంతకు యంత్రాంగం

● తొలిరోజు 45 రెవెన్యూ సదస్సులు.. 1184 అర్జీలు

తిరుపతి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావించిన రెవెన్యూ సదస్సులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. జనం వద్దకే రెవెన్యూ యంత్రాంగం వెళ్లింది. 1051 రెవెన్యూ గ్రామాలకు గాను తొలిరోజు 45 సదస్సులు నిర్వహించగా, 1092 మంది నుంచి 1184 అర్జీలు అందాయి. వాటిని ఆన్‌లైన్ చేసి రసీదులిచ్చారు. వీటిలో 29 సమస్యలకు అధికారులు అప్పటికప్పుడే పరిష్కార చూపారు. వచ్చిన అర్జీల్లో భూకబ్జాలకు సంబంధించి 21, 22ఏ నిషేధిత జాబితా భూములకు సంబంధించి 23 ఫిర్యాదులు ఉన్నాయి. భూకబ్జాలపై అత్యధికంగా తిరుపతి రెవెన్యూ డివిజన్ నుంచి 9 ఫిర్యాదులు వచ్చాయి. మిగిలిన అర్జీలు కొత్త రేషన్ కార్డులు, ఇతర సమస్యలకు సంబంధించినవి.



వడమాలపేట మండలం కల్లూరులో జరిగిన రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్

మేత భూములకు పట్టాలివ్వండి

చిల్లకూరు మండలం ఓడూరులో సదస్సుకు గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ హాజరయ్యారు. గ్రామ పరిధిలోని మేత పరంబోకు భూమిలో పంటలు సాగు చేసుకుంటున్న పేదలకే పట్టాలు మంజూరు చేసి కేటాయించాలని గ్రామస్తులు కోరారు. చెన్నకేశవస్వామి ఆలయానికి చెందిన భూములు ట్రస్ట్ ఆధీనంలో ఉన్నాయని, వాటిని దేవదాయశాఖ పరిధిలోకి చేర్చాలన్నారు.

టీటీడీకి ఇచ్చిన భూములకు పరిహారం ఇవ్వండి

ఏర్పేడు మండలం పల్లం గ్రామంలో శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, తహసీల్దారు భార్గవి పాల్గొన్నారు. 29 మంది రైతులు వివిధ సమస్యలపై అర్జీలిచ్చారు. అందులో అత్యధికంగా 19మంది తమ భూములను టీటీడీ ఉద్యోగుల ఇళ్ల స్థలాల కోసం ప్రభుత్వం స్వాధీనం చేసుకుందని ఇంతవరకు పరిహారం ఇవ్వలేదని ఫిర్యాదు చేశారు.

మేత భూముల్లోకి రానివ్వని శ్రీసిటీ యాజమాన్యం

సత్యవేడు మండలం శ్రీసిటీ పరిధిలోని చెరివి గ్రామంలో 25అర్జీలు అందాయి. ప్రధానంగా శ్రీసిటీ పరిధిలోని పంచాయతీకి చెందిన మేత బీడు భూములను గ్రామానికి కేటాయించాలని పలువురు రైతులు కోరారు. పశువుల మేతకు భూముల్లే ఇబ్బంది పడుతున్నామని చెప్పారు. తమ పశువులను మేత భూముల్లోకి రానివ్వకుండా శ్రీసిటీ యాజమాన్యం అడ్డుకుంటోందని ఫిర్యాదు చేశారు. తామిస్తున్న అర్జీలకు రసీదులు ఇవ్వడం లేదని రెవెన్యూ సిబ్బందిపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సాంకేతిక కారణాల వల్ల ఆన్‌లైన్ రసీదులు ఇవ్వలేకపోతున్నామని, అందుకే మాన్యువల్‌గా ఇస్తున్నామని సిబ్బంది సమాధానం ఇచ్చారు.

శ్మశాన సమస్యపై అధికారుల పరిశీలన: పుత్తూరు మండలం తడుకులో రంగుంట, తడుకు, తడుకు దళితవాడల్లో శ్మశానాలకు స్థల సమస్య ఉందని పలువురు అధికారులకు ఫిర్యాదు చేశారు. అప్పటికప్పుడే అధికారులు శ్మశాన భూములను పరిశీలించారు. హైకోర్టులో పెండింగ్ ఉన్న విద్యుత్తు సదాశివపురం వివాదాస్పద భూముల్లో ఈ-పాస్ పుస్తకాలు ఇవ్వాలని రైతులు అర్జీలు ఇచ్చారు.

22ఏ నుంచి తొలగించండి : తిరుపతి అర్బన్ పరిధిలో తుడా కార్యాలయం వెనుకగల కచ్చపి ఆడిటోరియంలో జరిగిన రెవెన్యూ సదస్సుకు 20 అర్జీలు అందాయి. ద్వారకానగర్, రామచంద్రనగర్, శివజ్యోతి నగర్‌కు చెందినవారు తమ ఆస్తులను 22ఏ నుంచి తొలగించాలని కోరారు.

● తిరుపతి రూరల్ మండలం చెర్లోపల్లెలో భూసమస్యల కన్నా రేషన్ కార్డులు, పింఛన్లు, ఇంటి స్థలాల కోసమే ఎక్కువ ఫిర్యాదులు వచ్చాయి.

● చంద్రగిరి మండలం పనపాకం పంచాయతీలో 111 అర్జీలు వచ్చాయి. ఆర్వోఆర్, మ్యూటేషన్, రేషన్ కార్డులు తదితర సమస్యలపై వినతులిచ్చారు.

● వడమాలపేట మండలం కల్లూరులో జరిగిన రెవెన్యూ సదస్సులో నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌తో కలిసి కలెక్టర్ వెంకటేశ్వర్ పాల్గొన్నారు. బాలాయపల్లి మండలం వెంకటరెడ్డిపల్లి సదస్సుకు జేసీ శుభంబన్సాల్, గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా హాజరయ్యారు.

భూ ఆక్రమణలు.. 22ఏ సమస్యపై 44 ఫిర్యాదులు

తిరుపతి(కలెక్టరేట్), ఆంధ్రజ్యోతి: 'జిల్లాలో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సులకు 1184అర్జీలు వచ్చాయి. వీటిలో భూ ఆక్రమణలు, 22ఏ కేసుల సమస్యలపై 44 అర్జీలు, భూసంబంధి, ఇతర సమస్యలకు 1140 అర్జీలు వచ్చాయి. వీటిలో మూడు భూ సమస్యలు, ఇతర సమస్యలకు సంబంధించి 26 అర్జీలను అప్పటికప్పుడే పరిష్కరించాం' అని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. మిగిలిన వాటిని కాలపరిమితి లోపల సంబంధిత అధికారులు పరిష్కరిస్తారన్నారు.

2,322 ప్రభుత్వ బడుల్లో నేడు మెగా పీటీఎం

● పాల్గొననున్న 1.56 లక్షల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు

● పార్టీలకు అతీతంగా గ్రామస్థాయి నాయకుల భాగస్వామ్యం

తిరుపతి(విద్య), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 2,322 ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ (పీటీఎం) జరగనుంది. విద్యారంగాన్ని మరింత మెరుగ్గా తీర్చిదిద్ది, విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసేందుకుగాను రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టింది. ప్రతిసారి సర్వసాధారణంగా నిర్వహించే పేరెంట్స్- టీచర్స్ మీటింగ్‌ను ఈసారి మరింత ప్రయోజనకరంగా జరిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పార్టీలకు అతీతంగా అన్ని రాజకీయ పార్టీల నాయకులను మెగా పీటీఎంలో భాగస్వాములను చేయాలని ఇప్పటికే ఆదేశాలను జారీ చేసింది. విద్యారంగంలో రాజకీయాలకు తావులేకుండా ఆయా పార్టీల నాయకులు పార్టీ చిహ్నాలు, కండువాలు తదితరాలు లేకుండా పాల్గొనాలని పిలుపునిచ్చింది. మెగా పీటీఎం నిర్వహణకు జిల్లాకు సుమారు రూ.43 లక్షలు విడుదల చేసింది. ఈ మొత్తంతో ఆయా పాఠశాలల్లో సదస్సు నిర్వహణకు సమగ్ర శిక్ష అభియాన్ అధికారులు ఇప్పటికే ఏర్పాట్లు చేశారు. శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మెగా పీటీఎం జరగనుంది. ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఒకే వేదికపైకి రానున్నారు. విద్య, సామాజిక పరంగా విద్యార్థి స్థితిగతులను తెలుసుకుని తగిన చర్యలు తీసుకునేందుకు ఈ వేదిక ఇంతకు మునుపుకంటే ఎంతో ఉపయుక్తం కానుంది.

శ్రీవారి దర్శనానికి 7 గంటలు

తిరుమల, డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి దర్శనానికి 7గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5గంటల వరకు 8 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు. ఇక, బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ లెక్కించగా, రూ.2.97 కోట్లు లభించినట్లు శుక్రవారం ఉదయం ప్రకటించింది.

'తూర్పు'నకు రానున్న రైలు



'తూర్పు' ప్రాంతానికి రైలు కూత పెట్టనుంది. ఈ ప్రాంత ప్రజల ఐదు దశాబ్దాల కల త్వరలో పట్టాలెక్కనుంది. పుత్తూరు నుంచి నారాయణవనం, పిచ్చాటూరు, నాగలాపురం మండలాల మీదుగా చెన్నై అత్తిపట్టు వరకు కొత్త రైల్వేలైన్ ఏర్పాటు కోసం ఎట్టకేలకు రైల్వేశాఖ అనుమతిచ్చింది. రైల్వేశాఖ తీసుకున్న ఈ నిర్ణయంతో సత్యవేడు నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- సత్యవేడు, ఆంధ్రజ్యోతి

పట్టాలెక్కనున్న అయిదు దశాబ్దాల కల

అత్తిపట్టు- పుత్తూరు రైల్వే లైన్‌కు నిధులు మంజూరు

పుత్తూరు నుంచి సత్యవేడు నియోజకవర్గంలోని నారాయణవనం, పిచ్చాటూరు, నాగలాపురం మండలాల మీదుగా తమిళనాడులోని చెన్నై హార్బర్ వరకు నిర్మించ తలపెట్టిన అత్తిపట్టు- వేపగుంట రైల్వేలైన్ నిర్మాణం అయిదు దశాబ్దాలుగా ప్రతిపాదన దశలోనే ఉంది. 1970లో అప్పటి కేంద్ర ప్రభుత్వం అత్తిపట్టు నుంచి పుత్తూరులోని వేపగుంట వరకు కొత్త రైల్వేలైన్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధంచేసింది. 88 కిలో మీటర్లున్న ఈ రైల్వేలైన్ నిర్మాణం తమిళనాడు(చెన్నై)లోని అత్తిపట్టు రైల్వేస్టేషన్ నుంచి మొదలై పెరియపాళెం, పాలవాక్కం, ఊత్తుకోట మీదుగ రాష్ట్రంలోని నాగలాపురం, పిచ్చాటూరు, నారాయణవనం, వేపగుంట మీదుగా పుత్తూరు వరకు ఎనిమిది రైల్వేస్టేషన్‌లను నిర్మించాల్సి ఉంది. అందుకు 189 హెక్టార్ల భూమిని సేకరించాలని రైల్వే ఇంజనీరింగ్ అధికారులు అప్పట్లో ప్రతిపాదనలు సిద్ధంచేశారు. అప్పటి నుంచి బడ్జెట్‌లో నిధులు కేటాయించక పోవడంతో దశాబ్దాలుగా కార్యరూపం దాల్చడంలేదు. అయితే 2012-2013 ఆర్థిక సంవత్సరంలో ఈ రైల్వేలైన్ నిర్మాణానికి భూసేకరణ పనులకు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దీంతో సదరన్ రైల్వే అధికారులు అప్పటి జిల్లా కలెక్టర్ సాల్మన్ ఆరోగ్యరాజ్‌ను కలిసి భూసేకరణకు సహకరించాలని కోరారు. రైల్వే మ్యాప్‌ను పరిశీలించిన అప్పటి కలెక్టర్.. భూసేకరణ చేసి రైల్వే అధికారులకు అప్పజెప్పాలని నాగలాపురం, పిచ్చాటూరు, నారాయణవనం తహసీల్దార్లను ఆదేశించారు. భూసేకరణకు ప్రత్యేకాధికారిగా అప్పటి జేసీ వినయ్‌చంద్ పర్యవేక్షణలో భూసేకరణకు సంబంధించిన నివేదికలను ప్రభుత్వానికి అందించారు. అయితే, అప్పటి బడ్జెట్‌లో కూడా కేంద్రం నిధులు కేటాయించలేదు. దీంతో ఈ ప్రాంతంలో రైల్వేలైన్ ఏర్పాటు కానుందని సంబరపడిన నియోజకవర్గ ప్రజలకు మళ్లీ నిరాశే మిగిలింది. ఇలా ప్రతిసారీ బడ్జెట్‌లో అత్తిపట్టు - పుత్తూరు రైల్వేకూత వినబడుతుందని ఆశగా ఎదురుచూడ్డం, నిరాశచెందడం పరిపాటిగా మారింది. ప్రస్తుతం 2024- 2025 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి చెన్నై రైల్వేజోన్‌లో పుత్తూరు- అత్తిపట్టు రైల్వేలైన్ భూసేకరణకు రైల్వేశాఖ అనుమతిచ్చింది. దీంతో మళ్లీ నియోజకవర్గ ప్రజలకుఆశలు చిగురుస్తున్నాయి. ఈ రైల్వేలైన్ నిర్మాణం రూపుదాల్చితే సత్యవేడు, నగరి నియోజకవర్గాల్లోని పలు మండలాల ప్రజలకు ఉపాధి అవకాశాలు లభించడంతో పాటు వ్యాపారాభివృద్ధి గణనీయంగా పెరగనుంది.

కార్మికుల భద్రతే లక్ష్యం: మంత్రి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కార్మికుల భద్రతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ స్పష్టం చేశారు. శుక్రవారం కలెక్టరేట్‌లో సేఫ్టీ వెల్ఫేర్ ఆఫ్ వర్కర్స్ పరిశ్రమల శాఖపై ఆయన కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్‌తో కలిసి సమీక్షించారు. భద్రత విషయంలో పరిశ్రమల యాజమాన్యాలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్మికుల భద్రత, సంక్షేమం, ఆరోగ్యం పట్ల ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు చెప్పారు. జిల్లాలో పదిమందితో కూడిన కమిటీని ఏర్పాటు చేసి, ఛైర్మన్‌గా కలెక్టర్ వీటిని పర్యవేక్షించాలన్నారు. కార్మిక చట్టాలు అమలయ్యేటట్లు చూడాలన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఈఎస్ఐ ఆస్పత్రులకు రావాల్సిన రూ.610 కోట్లు వెనక్కు వెళ్లాయన్నారు. కనీసం ఈఎస్ఐ భవనాన్ని కూడా నిర్మించలేదన్నారు. జిల్లాలో ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మాణానికి అవకాశాలను పరిశీలిస్తామన్నారు. విశ్రాంత ఐఏఎస్ వసుధా మిశ్రాతో ఏర్పాటు చేసిన ఉన్నతస్థాయి కమిటీ ఇదివరకే వైజాగ్, చిత్తూరు, తిరుపతి ప్రాంతాల్లో పరిశ్రమలను పరిశీలించిందని, కమిటీ నివేదిక ఆధారంగా నిబంధనలు అమలు చేస్తామన్నారు. వైఎస్సార్ బీమాలో అవినీతి జరిగిందని, 3,593 మంది బీమా కోసం దరఖాస్తు చేసుకోగా 958 మందికే చెల్లించారని, రూ.178 కోట్లకుగాను రూ.47 కోట్లు మాత్రమే ఇచ్చారని వివరించారు. స్థానిక యువత అవసరాలకు అనుగుణంగా నైపుణ్య శిక్షణ ఏర్పాటు చేస్తామన్నారు. పరిశ్రమలకు అవసరమయ్యే మానవ వనరులు అందించి స్థానికంగా 75 శాతం యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా గత ఐదేళ్లలో వివిధ పరిశ్రమల్లో 22 ప్రాణాంతక ప్రమాదాలు జరిగాయని, అందులో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. అలాంటివి జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని చెప్పారు. సమావేశంలో జాయింట్ లేబర్ కమిషనర్ బాలునాయక్, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రామకృష్ణ పాల్గొన్నారు.

ఈఎస్ఐలో సేవలు భేష్

తిరుపతి(వైద్యం): తిరుపతి ఈఎస్ఐ ఆస్పత్రిలో రోగులకు మంచి సేవలు అందుతున్నాయని మంత్రి సుభాష్ కితాబిచ్చారు. శుక్రవారం ఆయన స్థానిక ఈఎస్ఐ ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పురుషుల వార్డును తనిఖీ చేసి రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి ఆరా తీశారు. సిబ్బంది ముఖహాజరు, సమయపాలన అంశాలను పరిశీలించారు. ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.శ్యాంబాబు, ఆర్ఎంవో డాక్టర్ ఏపీఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

మమ అనిపించారు!

● ఫిర్యాదుదారుల్లేక సామాజిక తనిఖీ బహిరంగ సభ వెలవెల

● ఒకరి సస్పెన్షన్.. రూ.1.36 లక్షల రికవరీకి ఆదేశం

శ్రీకాళహస్తి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): తొట్టంబేడులో శుక్రవారం నిర్వహించిన ఉపాధి హామీ సామాజిక తనిఖీ బహిరంగ సభ ఫిర్యాదుదారులు లేక వెలవెలబోయింది. బహిరంగ సభలో సగం ఖాళీ కుర్చీలే దర్శనమిచ్చాయి. వచ్చామా.. వెళ్లామా అన్న రీతిలో సామాజిక తనిఖీ బహిరంగ సభ జరిగిందన విమర్శలు వచ్చాయి. 17వ విడదల సామాజిక తనిఖీ బహిరంగ సభకు అధ్యక్షులుగా ఎంపీడీవో సురేంద్రనాథ్ వ్యవహరించగా ముఖ్యఅతిథిగా డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ హాజరయ్యారు. మొత్తం 27పంచాయతీలో జరిగిన రూ.7.12కోట్లతో పూర్తి చేసిన పనులపై 12మంది డీఆర్పీలు సామాజిక తనిఖీలు నిర్వహించారు. కాసరం ఫీల్డ్ అసిస్టెంట్ బాలసుబ్రహ్మణ్యం మస్టర్లలో ఒకే సంతకాలు ఉండటం, కుటుంబ సభ్యుల పేర్లను గుర్తించడంతో ఆయన్ను సస్పెండ్ చేస్తున్నట్లు పీడీ తెలిపారు. రూ.1.36లక్షలు రికవరీకి ఆదేశించారు. పలువురు ఉపాధి సిబ్బందికి రూ.45వేలు జరిమానా విధించారు.



పంటల బీమా నమోదు
వేగవంతం చేయాలి


కాన్ఫరెన్సులో ఇన్సూరెన్సు కంపెనీ ప్రతినిధులు

తిరుపతి(ఎంఆర్‌పల్లె), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రబీ 2024-25 సంవత్సరానికి వరి, వేరుశనగ పంటలు వేసిన రైతుల పంటల బీమా నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లో జేసీ శుభం బన్సల్, జిల్లా వ్యవసాయాధికారి ప్రసాదరావు ఫ్యూచర్ జనరల్ ఇన్సూరెన్సు కంపెనీ ప్రతినిధులతో పంటల బీమా పురోగతిపై జూమ్ కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ రైతులందరూ ఎంపిక చేసిన వరి, వేరుశనగ పంటలకు బీమా పొందడానికి రుణం తీసుకున్న రైతులు బ్యాంకుల్లో.. మీసేవా కేంద్రాల నుంచి ప్రీమియం చెల్లించి పంటల బీమా ప్రక్రియ నమోదు చేసుకోవాలన్నారు. పంటల బీమా నమోదుపై రెవెన్యూ సదస్సులు, రైతు భరోసా కేంద్రాలు, బ్యాంకులు, బీమా కంపెనీతోట అవగాహన కల్పించేలా వ్యవసాయ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రధానమంత్రి పసల్ బీమా యోజన పథకం కింది జిల్లాలో వరి, వేరుశనగ పంటలను రబీ సీజన్‌కు ఎంపిక చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎల్డీఎం విశ్వనాథరెడ్డి, సీపీవో వెంకటేశ్వర్లు, ఉద్యానశాఖ అధికారి దశరథరామిరెడ్డి, ఏవో సరళ తదితరులు పాల్గొన్నారు.

నిరాధార ఆరోపణలతో కులచిచ్చు పెట్టొద్దు

● టీడీపీ ముస్లిం మైనారిటీ నాయకులు


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ముస్లిం మైనారిటీ నాయకులు

పాకాల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నిరాధార ఆరోపణలతో ప్రశాంతంగా ఉన్న పాకాలలో కులచిచ్చు పెట్టొద్దని టీడీపీ ముస్లిం మైనారిటీ నాయకులు మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో కోరారు. టీడీపీ మండల నాయకులతో కలిసి వారు మాట్లాడుతూ పుష్ప-2 సినిమా విడుదల సందర్భంగా కొందరు వైసీపీ అభిమానులు రెచ్చగొట్టేలా బ్యానర్లు కట్టారన్నారు. ఇది మంచి సాంప్రదాయం కాదని తొలగించాలని కోరిన టీడీపీ సానుభూతిపరులను దుర్భాషలాడారు. తొలగించడానికి ప్రయత్నించిన వారిపై మారణాయుధాలతో దాడిచేసి విచక్షణారహితంగా కొట్టారన్నారు. కొందరు వ్యక్తుల మధ్య జరిగిన ఘర్షణ మాజీ ఎమ్మెల్యే రాజకీయ స్వార్థం కోసం మైనారిటీ వర్గాలపై జరిగిన దాడిగా చెప్పడం దారుణమన్నారు. ముస్లిం మైనార్టీలు నివసించే ప్రాంతాలలో నీటి సమస్య పరిష్కరించడంతో పాటు తన సొంత ఖర్చులతో ఉరుసు ఉత్సవాలు నిర్వహించిన ఎమ్మెల్యే పులివర్తి నానిపై విమర్శలు చేయడం మాని అభివృద్ధికి సహకరించాలని కోరారు. వైసీపీ నాయకుల ధనదాహానికి బలై ప్రాణాలు పోగొట్టుకున్న ముస్లిం యువకుడి కుటుంబానికి ఏం సమాధానం చెబుతారన్నారు. నిరాధార ఆరోపణలు మానుకోకుంటే మైనారిటీ వర్గాలు ఏకమై తగిన బుద్ధి చెబుతారన్నారు. సమావేశంలో మండల టీడీపీ కన్వీనర్ బోయపాటి నాగరాజనాయుడు, జడ్పీటీసీ నంగా పద్మజరెడ్డి, ఫల్గుణ, నాజీర్, ఘనీబాయ్, లతీఫ్, ఇలియాస్, షరీఫ్, జియాఉద్దీన్, జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నాయకులకు పరామర్శ



పాకాల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): దాడి చేసిన వారిపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని.. పోలీసులు కేసులు నమోదు చేయకుంటే ఆ అధికారితో పాటు దాడికి పాల్పడిన వారిపై ప్రైవేటు కేసు పెడుదామని మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన పాకాలలో వైసీపీ నాయకులను పరామర్శించారు. కమతంపల్లెలో సెంథిల్ కుమార్, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ మునీర్, ఆయన కుమారుడు అఫ్రిద్‌లను పరామర్శించారు.

మానవ హక్కులపై అవగాహన తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న డైరెక్టర్ మీరా

భాకరాపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మానవ హక్కులపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని విన్స్ డైరెక్టర్ మీరా అన్నారు. శుక్రవారం చిన్నగొట్టిగల్లు జూనియర్ కళాశాల లో విద్యార్థులకు మానవ హక్కులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏటా డిసెంబర్ 10వ తేదీన మానవ హక్కుల దినోత్సవం జరుపుకుంటామన్నారు. ప్రతి మనిషికి హక్కులుంటాయని.. అవి పరిమితికి లోబడి అనుభవించాలని తెలిపారు. హక్కుల సాధనకు చట్టాలపై అవగాహన ఉండాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగరాణి, అడ్వకేట్ శ్రావణి, విన్స్ మండల కోఆర్డినేటర్ రహమతుల్లా తదితరులు పాల్గొన్నారు.

పాతకాల్వలో సప్లైఛానల్
పునరుద్ధరణ పనులు


కాలువ పనులు చేపడుతున్న అధికారులు

తిరుపతి రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం పేరూరు లింకు కాలువ నుంచి పాతకాల్వ చెరువుకి నీరు వచ్చే సప్లైఛానల్ పునరుద్ధరణ పనులను ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో చేపడుతున్నారు. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని చొరవతో ఇరిగేషన్, రెవెన్యూ, పంచాయతీ అధికారుల ఆధ్వర్యంలో కాలువ స్థలాన్ని సర్వేచేసి ఉపాధి కూలీలతో హద్దు రాళ్లను నాటారు. కాలువకు అడ్డుగా ఉన్న మొక్కలని తొలిగిస్తున్నారు. కాలువను పక్కపొలాల రైతులు తమ వ్యవసాయ భూమిలో కలిపేసుకోవడంతో వారితో మాట్లాడి పునరుద్దరణ పనులు చేపడుతున్నామని.. గ్రామానికి చెందిన టీడీపీ నేతలు శివారెడ్డి, రోశిరెడ్డి తెలిపారు. చెరువుకింద దాదాపు 200 ఎకరాల ఆయకట్టు ఉందని, ఈ పనులతో సాగునీటికి ఇబ్బంది ఉండదన్నారు. ఎమ్మెల్యే చొరవతో పునరుద్దరణ పనులు చేపడుతుండటం సంతోషంగా ఉందని తెలిపారు.

ఏడుగురు వైసీపీ నేతలపై కేసుల నమోదు

పాకాల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పాకాలలో పుష్ప-2 ఫ్లెక్సీతో టీడీపీ, వైసీపీ నాయకుల మధ్య చోటుచేసుకున్న ఘటనలో శుక్రవారం పాకాల పోలీసులు ఏడుగురు వైసీపీ నేతలపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. వైసీపీ వర్గీయులు తమపై దాడి చేశారని టీడీపీకి చెందిన రెడ్డిప్రసాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారించిన పోలీసులు వైసీపీకి చెందిన అఫ్రీద్, మోహినుద్దీన్, బషీర్, సర్ఫుద్దీన్, షాబుద్దీన్, ఖాదర్‌వల్లీ, అష్రఫ్‌లపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు.

ఈ దారిలో నడిచేదెలా..!


వీధిలోకి వెళ్లే దారిలో అడ్డంగా నీరు

తిరుపతి రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం పుదిపట్ల పంచాయతీలో తిరుపతి- చంద్రగిరి రహదారిని ఆనుకుని రోడ్డు పక్కనే ఉన్న ఓ వీధిలోకి వెళ్లే మార్గంలో నీరు అడ్డుగా చేరింది. దీంతో మార్గంలో నడిచేందుకు ప్రజలు అవస్థలు పడుతున్నారు. చినుకుపడితే చెరువుని తలపిస్తున్నాయని వాపోతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

కలెక్టరేట్‌లో అయోగ్ సీఈవో

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నీతి అయోగ్ సీఈవో బీవీఆర్.సుబ్రహ్మణ్యం శుక్రవారం కలెక్టరేట్‌కు వచ్చారు. కలెక్టర్ వెంకటేశ్వర్, మున్సిపల్ కమిషనర్ మౌర్యతో కలిసి ఆయన పలు అభివృద్ధి పనులపై చర్చించారు.

నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం


నూతన కార్యవర్గంతో ప్రమాణం చేయిస్తున్న హరిప్రసాద్

తిరుపతి అర్బన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): శ్రీసిద్ధి వినాయక ట్యాక్సీడ్రైవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గం ప్రమాణ స్వీకారోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విష్ణు నివాసం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పసుపులేటి హరిప్రసాద్ హాజరయ్యారు. అధ్యక్షుడిగా బిల్లా హరినాథ్, ఉపాధ్యక్షుడిగా శెట్టి సురేష్‌కుమార్, కార్యదర్శిగా రామరాజు, గౌరవాధ్యక్షుడిగా జేబీ బాలాజీ, సభ్యులు బాధ్యతలు స్వీకరించారు.

డీబీఆర్ రోడ్డులో ట్రాఫిక్ సమస్య



ప్రైవేటు హోటల్ ఎదుట నిలబడిన ట్రావెల్స్ బస్సు

తిరుపతి అర్బన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): డీబీఆర్ రోడ్డులో ట్రాఫిక్ సమస్య రోజురోజుకూ పెరుగుతోంది. ట్రావెల్స్ వాహనాలను ఇక్కడ పార్కింగ్ చేయడం వల్ల ఇతర వాహనదారులు అవస్థ పడుతున్నారు. ఆ మార్గంలో ప్రైవేటు హోటల్స్ ఉండడం, ట్రావెల్స్ బస్సులు, ఇతర వాహనాలు వాటి ముందు పార్కింగ్ చేస్తుండడంతో రోడ్డు ఆక్రమణకు గురవుతోంది. రోడ్డు ఇరుకుగా ఉండడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ట్రాఫిక్ పోలీసులు, నగర పాలక సంస్థ అధికారులు దీనిపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

త్వరలో అందుబాటులోకి క్రికెట్ మైదానం

గొల్లవానిగుంట క్రీడా మైదానాన్ని పరిశీలించిన శాప్ చైర్మన్


మైదానాన్ని పరిశీలిస్తున్న శాప్ చైర్మన్ రవినాయుడు

తిరుపతి(క్రీడలు), డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని గొల్లవానిగుంటలో స్మార్ట్‌సిటీ నిధులతో నిర్మిస్తున్న క్రికెట్ మైదానాన్ని త్వరలోనే అందుబాటులోకి తీసుకువస్తామని శాప్ చైర్మన్ ఎ.రవినాయుడు తెలిపారు. శుక్రవారం ఆయన డీఎస్‌డీవో సయ్యద్‌సాహెబ్‌తో కలసి మైదానాన్ని పరిశీలించారు. స్మార్ట్‌సిటీ అధికారులతో సమన్వయం చేసుకుని పెవిలియన్ బిల్డింగ్, మైదానం పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు.

రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు పూజిత్


పూజిత్‌ను అభినందిస్తున్న పాఠశాల నిర్వాహకులు

తిరుపతి(క్రీడలు), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అండర్ 17 బేస్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో మంగళం బాలచంద్ర మెమోరియల్ హైస్కూల్(బీసీఎం) విద్యార్థి పూజిత్ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. శుక్రవారం పాఠశాల వ్యవస్థాపకుడు కృష్ణమూర్తినాయుడు, కరస్పాండెంట్ ప్రియా పూజిత్‌ను సత్కరించారు. రాష్ట్రస్థాయి పోటీలలో సత్తా చాటాలని ఆకాంక్షించారు. ప్రిన్సిపాల్ సుకన్య, వ్యాయామ ఉపాధ్యాయురాలు ప్రమీన పాల్గొన్నారు.

అక్రమ కేసులు కొట్టేయండి

- శాప్ చైర్మన్‌కు విద్యార్థి సంఘాల విన్నపం



తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో విద్యార్థి సంఘాల నాయకులపై బనాయించిన అక్రమ కేసులను కొట్టివేసే విధంగా చూడాలని శాప్ చైర్మన్ రవినాయుడిని పలు విద్యార్థి సంఘాల నాయకులు విన్నవించారు. వారు మాట్లాడుతూ యూనివర్సిటీల్లో పీహెచ్‌డీ చేస్తున్న విద్యార్థులకు నాన్ నెట్ ఫెలోషిప్‌లు మంజూరు చేయాలన్నారు. ఎస్వీయూలో మత ప్రచారం, దాడి వంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. సమస్యలను వర్సిటీ అధికారులు, మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తోడ్పడతానని రవినాయుడు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మల్లికార్జున (ఎన్ఎస్‌యూఐ), ఆర్కే నాయుడు (టీఎన్ఎస్ఎఫ్), అక్బర్, అశోక్, వినోద్, (ఎస్ఎఫ్ఐ) తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి జాతీయ సదస్సు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ లైబ్రరీ ఆధ్వర్యంలో శనివారం నుంచి రెండు రోజుల పాటు జాతీయ సదస్సు నిర్వహించనున్నారు. టెక్నాలజీ, ఎడ్యుకేషన్ అండ్ మీడియా ఫర్ అకడమిక్ అండ్ పబ్లిక్ లైబ్రరీ ఎంపవర్‌మెంట్ అంశంపై ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఉదయం 10 గంటలకు సెనేట్ హాల్లో ప్రారంభ సభ నిర్వహిస్తారు. వివిధ ప్రాంతాలకు చెందిన ప్రతినిధులు పరిశోధనా పత్రాలు సమర్పిస్తారని సదస్సు ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రొఫెసర్ కొంగర సురేంద్ర బాబు నాయుడు తెలిపారు.

భూసమస్యల పరిష్కారానికే
రెవెన్యూ సదస్సులు

ఎమ్మెల్యే పులివర్తి నాని



రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెలే పులివర్తి నాని


ఉస్తికాయల పెంటలో మాట్లాడుతున్న తిరుపతి ఆర్డీవో రామ్మోహన్

రామచంద్రాపురం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రైతుల భూములపై పూర్తి హక్కులను కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని.. భూసమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. శుక్రవారం కమ్మపల్లి గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సుకు ఎమ్మెల్యే నాని ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రైతులకు న్యాయం చేయడమే సీఎం చంద్రబాబు నాయుడు లక్ష్యమని.. గత వైసీపీ ప్రభుత్వంతో భూ రీసర్వే నిర్వహించి ఫ్రీహోల్డ్ పేరుతో భూదోపిడీ చేశారని ఆరోపించారు. ఒకరి భూమిని మరొకరి పేరుపై ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకొని భూములను స్వాహా చేసిన ఘటనలు చాలా ఉన్నాయని తెలిపారు. అలాంటి ఘటనపై రైతులు కార్యాలయాలు, కోర్టుల చుట్టూ తిరుగుతూ డబ్బులు ఖర్చు పెట్టుకుంటున్నారని, అలాంటి రైతుల సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ సదస్సులు ఉపయోగపడుతాయన్నారు. అనంతరం ఎమ్మెల్యే ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ చంద్రశేఖర్, తహశీల్దారు వెంకటరమణ, ఎంపీడీవో ఇందిరా, డీటీ అన్వర్‌బాషా, ఆర్ఐ లక్ష్మీనారాయణ, నాయకులు చిన్నబాబు, మాజీ ఎంపీపీ కేశవులునాయుడు, మండల టీడీపీ అధ్యక్షులు తిరుమలరెడ్డి, జనార్దన్‌నాయుడు, అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

తిరుపతి రూరల్: గ్రామాల్లో భూ సమస్యలను పరిష్కరించుకునేందుకు రెవెన్యూ సదస్సులు ఎంతగానో ఉపయోగ పడుతాయని, ప్రజలు.. రైతులు సద్వినియోగం చేసుకోవాలని తిరుపతి ఆర్డీవో రామ్మోహన్ తెలిపారు. తిరుపతి రూరల్ మండలం చెర్లోపల్లె గ్రామ సచివాలయంలో సర్పంచ్ బొల్లినేని సుభాషిని అధ్యక్షతన శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సదస్సును సందర్శించిన ఆర్డీవో మాట్లాడుతూ అర్జీదారులు ఇచ్చే అన్ని ఫిర్యాదులను స్వీకరిస్తున్నామని.. ఆయా విభాగాలకు అందించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా భూ సమస్యలకు సంబం ధించి 18 ఫిర్యాదులు, రేషన్‌కార్డుల కోసం 21, పింఛన్ల కోసం 9, గ్రామకంఠంలో నివసిస్తూ అనుభవ పట్టా కోసం ముగ్గురు అర్జీలను అందించారు. నోడల్ అధికారిగా డిప్యూటీ కలెక్టర్ రోస్‌మండ్ వ్యవహరించారు. ఆర్ఎస్‌డీటీ మోహన్, మండల సర్వేయర్ హేమకుమార్, వీఆర్వో ఈశ్వరయ్య, పంచాయతీ కార్యదర్శి సుజాత పాల్గొన్నారు.

చంద్రగిరి: భూ సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని తహశీల్దారు శివరామసుబ్బయ్య అన్నారు. శుక్రవారం పనపాకంలో రెవెన్యూ సదస్సులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు భూ సమస్యలపై అర్జీలు అందించి పరిష్కరించు కోవాలన్నారు. పనపాకం రెవెన్యూ సదస్సులో 111 అర్జీలు వచ్చాయి. ఇందులో ప్రధానంగా ఆర్‌వోఆర్, మ్యుటేషన్, సర్వే, రేషన్ కార్డులు, ఆన్‌లైన్‌లో మార్పులు, చేర్పులు తదితర సమస్యలపై అర్జీలు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండలా. ధ్యక్షుడు సుబ్రహ్మణ్యంనాయుడు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

భాకరాపేట: భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహశీల్దారు జనార్దన్‌రాజు తెలిపారు. చిన్నగొట్టిగల్లు మండలం దేవరకొండ గ్రామంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో డీటీ వాసుదేవ కుమార్, ఆర్ఐ జానకిరామ్, సర్వేయర్లు గణేష్, కేశవులు సర్పంచ్ విజయకుమార్, టీడీపీ నేత కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పాకాల: పదిపుట్లబైలులో తహశీల్దారు నిత్యానందబాబు ఆధ్వర్యంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. పలు సమస్యలపై ప్రజలు అర్జీలు అందజేశారు. అర్జీదారులకు సగం మందికి అధికారులు రసీదులు ఇవ్వలేదు.

ఎర్రావారిపాలెం: తమ పంట పొలాలకు వెళ్లేందుకు అటవీ భూముల్లో నుంచి దారి సౌకర్యం కల్పించాలని ఉస్తికాలయ పెంటలో జరిగిన రెవెన్యూ సదస్సులో గ్రామానికి చెందిన రైతు ఆర్డీవో రామ్మోహన్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పంచాయతీలో 49 వినతులు అందాయి. తహశీల్దారు పరమేశ్వరస్వామి, ఆర్ఐ శ్రీనివాసులు, సర్వేయర్ శ్రీనివాసులు, సర్పంచ్ రమేష్, ఎంపీటీసీ నాగేశ్వరరావు, రమణారెడ్డి, బాబు పాల్గొన్నారు.

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు ఘన నివాళులు


చంద్రగిరిలో ఉపాధ్యాయుల నివాళులు

చంద్రగిరి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రహ్మణ్యంనాయుడు ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను కొనియాడారు. కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంటు టీడీపీ ఉపాధ్యక్షుడు గౌస్‌బాషా, సీనియర్ నాయకులు రమేష్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి కొండూరు ప్రవీణ్, తెలుగు యువత అధ్యక్షుడు రాజులగారి వినోద్, చెంచయ్య నాయుడు, మన్సూర్, లోకనాథంరెడ్డి, దళిత నాయకులు నాగరాజ, శంకర్‌మాదిగ, అంకాలయ్య, మండీరావు, తదితరులు పాల్గొన్నారు.

● చంద్రగిరి టవర్ క్లాక్ వద్ద ఎంఈవో లలితకుమారి ఆధ్వర్యంలో డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చంద్రగిరి మండల యూటీఎఫ్ గౌరవాధ్యక్షులు రామిరెడ్డి, అధ్యక్షులు రాజేంద్ర బాబు, ప్రధాన కార్యదర్శి ధనంజయ, కోశాధికారి చెంచయ్య, శ్రీరాములు, వెంకటరమణ, కృష్ణమూర్తిరెడ్డి, చలపతి, గోపాల కృష్ణ, సిద్దయ్య, హరి ప్రసాద్, రవికుమార్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

● టవర్ క్లాక్ వద్ద అంబేడ్కర్ ఆశయ పోరాట సమితి ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో దళిత నాయకులు పాల్గొన్నారు.

పాకాల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం మండలంలో పలు గ్రామాల్లో ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. స్థానిక అంబేడ్కర్ భవనం ఆధ్వర్యంలో విగ్రహానికి పూలమాలలు వేసి ఆయన అణగారిన వర్గాల కోసం చేసిన కృషిని కొనియాడారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గ్రంథాలయం ఆధ్వర్యంలో విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. భవన కమిటీ అధ్యక్షుడు జి.ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి గణేష్, ఎంఈవో బాబ్జీ, ప్రధానోపాధ్యాయులు మహమ్మద్ రఫీ, జి.రామయ్య, తులసీరామ్, ప్రభు, రవీంద్రబాబు, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ఎర్రావారిపాలెం: రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ ఆశయాల సాధనతోనే భారత దేశంలో పేదల అభివృద్ధి జరుగుతుందని ఎమ్మార్పీఎస్ నాయకుడు పల్లెపాక నాగరాజు అన్నారు. శుక్రవారం తలకోన రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో హరి, ఓబులేశు, రెడ్డెప్ప, గణేష్, విశ్వనాథ, రమేష్, జయేంద్ర, మురళీ, సురేష్ నాయక్, రెడ్డినాయక్, సుబ్బలక్ష్మమ్మ పాల్గొన్నారు.

అమ్మవారికి అయ్యవారి సారె


సారెతో టీటీడీ అధికారులు, చైర్మన్

తిరుమల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన శుక్రవారం పంచమితీర్థం ఉత్సవాన్ని పురస్కరించుకుని తిరుమల శ్రీవారి ఆలయం నుంచి సారె సమర్పించారు. ఏటా పంచమితీర్థం రోజున తిరుమల నుంచి సారె తీసుకెళ్లడం ఆనవాయితీగా వస్తోంది. శ్రీవారి ఆలయంలో వేకువజాము 2.30 నుంచి పరిమళాన్ని (నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలీగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన మిశ్రమం) విమాన ప్రాకారంలో ఊరేగింపు చేపట్టారు. అనంతరం లక్ష్మీ అమ్మవారికి ఏకాంతంగా తిరుమంజనం నిర్వహించారు. ఉదయం 4.30 గంటలకు తిరుమల శ్రీవారి ఆలయం నుంచి పసుపు, కుంకుమ, ప్రసాదాలు, తులసి, వస్త్రాలు, ఆభరణంతో కూడి సారె ఊరేగింపు మొదలైంది. ఈ సారెను గజాలపై ఆలయ నాలుగు మాడ వీధుల గుండా ఊరేగించి కాలినడకన తిరుమల నుంచి తిరుపతిలోని అలిపిరికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి పాల్గొన్నారు.

ఏఐ సాంకేతికతతో విప్లవాత్మక మార్పులు


సదస్సులో పాల్గొన్న శ్రీనివాసరావు నాయక్, ప్రిన్సిపాల్ సుధాకర్‌రెడ్డి

తిరుపతి రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషీన్‌లెర్నింగ్ సాంకేతికత ద్వారా విద్యుత్ వాహనాల తయారీ, బ్యాటరీ నిర్వహణ వ్యవస్థల్లో విప్లవాత్మక మార్పులు రానున్నాయని తిరుచ్చి ఎన్ఐటీ ప్రొఫెసర్ డాక్టర్ పి.శ్రీనివాసరావునాయక్ తెలిపారు. కరకంబాడి రోడ్డులోని ఎస్వీకాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో ట్రిపుల్ ఈ విభాగం ఆధ్వర్యంలో అకాడమీ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇన్నోవేటివ్ రీసెర్చ్(ఏఎస్ఆర్ఎఫ్), ఎస్ఈఆర్‌బీ ఆర్థిక సౌజన్యంతో ఎలక్ట్రిక్ వెహికల్ డిజైన్ అండ్ బ్యాటరీ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌పై రెండు రోజుల జాతీయ సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. అతిథులుగా వచ్చిన మెదున్‌కృష్ణ, రాంజీతివారి, శరవణ్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.సుధాకర్‌రెడ్డితో ఆయన కలసి సదస్సును ప్రారంభించి మాట్లాడారు. ఏఐ, ఎంఎల్ సాంకేతికతను ఉపయోగించి విద్యుత్ వాహనాల కోసం ఆప్టిమైజ్డ్ డిజైన్స్ అభివృద్ధి చేయడంతో పాటు వాహనాల నిర్వహణ, మరమ్మతుల అవసరాలను అంచనా వేయొచ్చని వివరించారు. హెడ్ డాక్టర్ లక్ష్మీదేవి, డాక్టర్ కె.కుమార్ పాల్గొన్నారు.

టీటీడీ చైర్మన్‌ను కలిసిన శాప్ చైర్మన్


వినతిపత్రం అందజేసిన రవినాయుడు

తిరుమల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): శాప్ చైర్మన్ రవినాయుడు శుక్రవారం టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడిని మర్యాదపూర్వకంగా కలిశారు. తిరుమలలోని గాయత్రి విశ్రాంతి భవనంలో చైర్మన్‌ను కలిసి క్రీడలకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. తిరుపతి ఎస్వీ వర్సిటీలోని శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఆధునికీకరణతో పాటు హాకీ అకాడమీ పునరుద్దరణకు టీటీడీ నుంచి సహాయ సహకారాలు అందించాలని విన్నవించారు. చైర్మన్ సానుకూలంగా స్పందించారు.

నేడు వెటర్నరీ ఉద్యోగ సంఘ ఎన్నికల పోలింగ్

తిరుపతిరూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఎస్వీ వెటర్నరీ వర్సిటీ బోధనేతర ఉద్యోగుల సంఘ ఎన్నికల పోలింగ్ శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు జరగనుంది. తిరుపతి, గన్నవరం కేంద్రంగా రాయలసీమ, కోస్టల్ ఆంధ్రాజోన్‌లలో జరిగే ఈ ఎన్నికల పోలింగ్‌లో మొత్తం 166మంది ఉద్యోగులు ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. అన్ని ఏర్పాట్లు చేసినట్లు వర్సిటీ రిటర్నింగ్ అధికారి ప్రొఫెసర్ డాక్టర్ ఆర్.వేణు పేర్కొన్నారు. అదే రోజు సాయంత్రానికి ఫలితాలు తేలనున్నాయి. ఫలితాల అనంతరం కొత్తకార్యవర్గం కొలువుదీరనుంది.

ఆత్మస్థైర్యంతో వికలత్వాన్ని జయించొచ్చు



తిరుపతి (ఆటోనగర్), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆతస్థైర్యంతో వికలత్వాన్ని జయించవచ్చునని కెనరా బ్యాంక్ ఏజీఎం నాగరాజరావు, రాస్ ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటరత్నం అన్నారు. రాస్ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం అంతర్జాతీయ ప్రత్యేక ప్రతిభావంతుల దినోత్సవం నిర్వహించారు. ప్రత్యేక ప్రతిభావంతులు అందుబాటులో ఉన్న ఆధునిక పరిజ్ఞానంతో ఎన్నో అద్భుతాలు సృష్టిస్తున్నారని చెప్పారు. అనంతరం వీల్‌ఛైర్లు, చెవిటి మిషన్లు, మూడు రకాల చేతికర్రలు, దుప్పటు, ట్రైసైకిల్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో బ్యాంక్ మేనేజరు ఉమాపతి, రాస్ ప్రాజెక్టు డైరెక్టర్లు, వి.నాగరాజు, వై.యువరాజ్, నాగేశ్వర్, బాలాజీ, మాధవి, భ్రమరాంబిక తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



తిరుపతి (కలెక్టరేట్), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నారావారిపల్లెకు చెందిన కె.గంగయ్య భార్య సుశీలమ్మకు కలెక్టర్ వెంకటేశ్వర్ కలెక్టరేట్‌లో శుక్రవారం సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.2 లక్షల చెక్కు అందజేశారు. ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న విషయమై ఆమె ఇటీవల స్వగ్రామానికి వచ్చిన సీఎం చంద్రబాబుకు విన్నవించారు.

మూడో గేటు వద్ద తోపులాట

తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి: పుష్కరిణిలోని గేటు నెంబరు మూడు వద్ద కాస్త తోపులాట జరిగింది. భక్తులు ఇబ్బంది పడ్డారు. ఉదయం 10.04 గంటల ప్రాంతంలో వీఐపీ, ప్రెస్ గ్యాలరీ ఎంట్రెన్స్ వద్దకు భక్తులు భారీగా చేరుకుని లోపలికి వెళ్ళడానికి ప్రయత్నించారు. దీంతో తోపులాట, తొక్కిసలాట చోటుచేసుకుంది. సామాన్య భక్తులు సైతం వీఐపీ లైన్‌లోకి రావడంతో పోలీసులు, టీటీడీ భద్రతా సిబ్బంది వారిని నియంత్రించకలేకపోయారు. ఒక దశలో కొందరు భక్తులు పోలీసులపై తిరగబడ్డారు. చక్రస్నానం ముగిశాక భక్తులు బయటకు వచ్చే సమయంలో ఒకరిపై ఒకరు పడి గాయపడ్డారు. కొందరు మహిళలకు ఇనుప బ్యారికేడ్లు తగిలి స్వల్ప గాయాలయ్యాయి.



భద్రత కట్టుదిట్టం

పంచమీతీర్థానికి ఎస్పీ సుబ్బరాయుడు పర్యవేక్షణలో కట్టుదిట్టమైన భద్రను ఏర్పాటు చేశారు. పద్మ సరోవరం వద్ద భక్తులు ఇబ్బందులకు గురికాకుండా, అకతాయిల బెడద లేకుండా నిఘా ఉంచారు. చక్రస్నానం ప్రశాంతంగా ముగిసేలా భద్రత చేపట్టారంటూ పోలీసు అధికారులు, సిబ్బందికి ఎస్పీ అభినందనలు తెలిపారు.

సర్పంచ్‌చే అన్నదానం



భక్తులకు అన్నదానం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి, సర్పంచ్ రామచంద్రారెడ్డి

తిరుచానూరు, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): ఆస్థాన మండపం సమీపంలో తిరుచానూరు సర్పంచ్ కె.రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో సుమారు 30వేల మందికి ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం అన్నప్రసాదాలు అందజేశారు. మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి హాజరై అన్నదానం ప్రారంభించారు. ఎంపీటీసీలు నరేష్‌రెడ్డి, యోగానందరెడ్డి, శేఖర్‌రెడ్డి, పలువురు వార్డుమెంబర్లు పాల్గొన్నారు. అలాగే పద్మావతిపురంలో ప్రకాష్ భక్తులకు అన్నదానం చేశారు.

సావిత్రికి ఘననివాళి



దేవసేనకు సావిత్ర పురస్కారాన్ని ప్రదానం చేస్తున్న నేతలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మహానటి సావిత్రి సహజ నటిగా కీర్తి గడించారని రాయలసీమ రంగస్థలి అధ్యక్షుడు గుండాల గోపీనాథరెడ్డి పేర్కొన్నారు. సావిత్రి జయంతి కార్యక్రమాన్ని తిరుపతిలో శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అనేక కష్టాల నుంచి సినిమా రంగంలోకి ప్రవేశించిన సావిత్రి అగ్ర నాయికగా ఎదిగిందన్నారు. దానధర్మాలు చేసి విషాదాంతం చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాయలసీమ రంగస్థలి తరఫున ప్రముఖ రంగస్థలి నటి దేవసేనకు సావిత్రి పురస్కారాన్ని ప్రదానం చేశారు. శాలువా, పుష్ప గుచ్ఛం, జ్ఞాపిక, ధృవీకరణపత్రంతో సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కెఎస్ రాజా, పద్మనాభం, కొత్తపల్లె సుబ్రమణ్యం, హనుమంతరావు, శంకరయ్య, కేశవరావు, సోము ఉమాపతి, భాస్కర్, రవి, కళాకారులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ రాజుకు సన్మానం



తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ వీరాభిమాని, తిరుపతికి చెందిన ఎన్టీఆర్ రాజును మహాబోధి సాహిత్య వేదిక శుక్రవారం సత్కరించింది. ఇటీవల తిరుపతిలో నిర్వహించిన ఎన్టీఆర్ సినీ గేయ వజ్రోత్సవ గోష్ఠికి ఎన్టీఆర్ రాజును నిర్వాహకులు ఆహ్వానించారు. అనారోగ్య కారణంగా ఆయన ఈ కార్యక్రమానికి హాజరుకాలేదు. ఈ క్రమంలో సభ నిర్వాహకులు ఎన్టీఆర్ రాజు ఇంటికి వెళ్లి శాలువా, జ్ఞాపికతో సత్కరించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ బాల సుబ్రమణ్యం పాల్గొన్నారు.

జాతీయ గ్రీన్ లిటరేచర్ ఫెస్టివల్‌కి నీలకంఠ



తిరుపతి(విద్య), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రీన్ లిటరేచర్ ఫెస్టివల్‌కు కరకంబాడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బయాలజీ టీచర్ నీలకంఠం ఎంపికయ్యారు. ప్రకృతి, పర్యావరణ పరిరక్షణ జాతీయ స్థాయి సదస్సు బెంగళూరులో శనివారం జరుగనుంది. ఈ అంశంపై అనేక రచనలు చేసిన నీలకంఠకు ఆహ్వానం లభించింది. ఆయన నేషనల్ గ్రీన్‌కోర్ స్టేట్ కోఆర్డినేటర్‌గా పనిచేస్తున్నారు.

వేడుకగా శ్రీవారి సారె ఊరేగింపు

తిరుచానూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పద్మావతి అమ్మవారికి సారె ఊరేగింపు శుక్రవారం కన్నులపండువగా సాగింది. వేకువజామున తిరుమలలో జీయర్ స్వాముల సమక్షంలో పట్టు చీర, పసుపు, చందనం, కుంకుమ, బంగారు ఆభరణాలు, అన్నప్రసాదాలతో కూడిన సారెతో టీటీడీ అధికారులు, ఏకాంగులు, అర్చక పరిచారకులు కాలిమార్గాన అలిపిరికి చేరుకున్నారు. అక్కడ అదనపు ఈవో వెంకయ్యచౌదరి, జేఈవో వీరబ్రహ్మం వీటిని స్వీకరించారు. ఏనుగు అంబారీ మీద, కళాబృందాల ప్రదర్శనల మధ్య సారె తిరుచానూరుకు బయలుదేరింది. కోమలమ్మ సత్రం, కోదండరామాలయం, గోవిందరాజస్వామి ఆలయం, ఆర్టీసీ బస్టాండ్, లక్ష్మీపురం మీదుగా తిరుచానూరుకు ముఖద్వారం వద్దనున్న పసుపు మండపానికి తీసుకొచ్చారు. అక్కడ సారెకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరువీధుల్లో ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి తీసుకొచ్చారు. ఉదయం 10.35 గంటలకు పద్మపుష్కరిణి వద్ద శ్రీవారి సారెను అర్చకులకు అందజేశారు.



తిరుమల నుంచి తీసుకొచ్చిన నగలపెట్టెను అలిపిరి వద్ద జేఈవోకు అందించిన అదనపు ఈవో వెంకయ్య చౌదరి

బంగారు చీరలో అమ్మవారు

పంచమి రోజున బంగారు చీరలోని అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. రూ.4 కోట్లు విలువైన బంగారు చీరను 12 ఏళ్ల కిందట ఒక భక్తుడు కానుకగా అందించారు. ప్రతి పంచమికీ దీనిని అలంకరిస్తారు.

దర్శనానికి అవస్థలు

శుక్రవారం అమ్మవారి మూలమూర్తిని దర్శించుకోవడానికి సరైన ఎంట్రీ భక్తులకు చూపకపోవడంతో, ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు చాలా మంది భక్తులు దర్శనానికి వెళ్లలేకపోయారు. చక్రస్నానం ముగియగానే వందలాది మంది భక్తులు ఒక్కసారిగా ఆలయం వద్ద ఉన్న వాహన మండపం వద్దకు చేరుకున్నారు. దీంతో తోపులాట జరిగింది. భద్రతా సిబ్బంది అప్రమత్తమై క్యూలైన్ల గేట్లు తెరవడంతో భక్తులు అమ్మవారి దర్శనానికి వెళ్లారు.

అడుగడుగునా అన్నప్రసాదాలు

తిరుచానూరులోని తోలప్ప గార్డెన్స్ జిల్లా పరిషత్ హైస్కూలు, పసుపు మండపం, నవజీవన్ ఆసుపత్రి వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన వితరణ కేంద్రాల్లో ఉప్మా, పొంగలి, సాంబారు అన్నం, దధ్యోజనం, చక్కెర పొంగలి, పులిహోర, పాలు, బిస్కెట్లు, వాటర్ బాటిల్స్ అందజేశారు. తిరుచానూరు పెద్దఎత్తున గ్రామస్థులు కూడా అనేక చోట్ల అన్నదానం చేశారు.

నేడు పుష్పయాగం

పద్మావతీ అమ్మవారి ఆలయంలో శనివారం సాయంత్రం ఐదు గంటలకు పుష్పయాగం నిర్వహించనున్నారు. భక్తులు టికెట్టు కొనుగోలు చేసి పుష్పయాగంలో పాల్గొనవచ్చు. ఈ సందర్భంగా కల్యాణోత్సవం, ఊంజల్ సేవను రద్దుచేశారు.

నేత్రపర్వంగా స్నపనతిరుమంజనం

పుష్కరిణిలోని పంచమీతీర్థం మండపంలో అమ్మవారు, చక్రాత్తాళ్వార్లకు స్నపన తిరుమంజనం నేత్రపర్వంగా నిర్వహించారు. కంకణభట్టార్ శ్రీనివాసాచార్యులు నేతృత్వం వహించారు. అమ్మవారికి అలంకరించిక పూలమాలలు, కిరీటాలు భక్తులకు కనువిందు చేశాయి. పుష్కరిణిలోని పసుపు మండపం, ఫలపుష్పసోయగంతో భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.





స్నపన తిరుమంజనంలో పాల్గొన్న టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి తదితరులు

మధ్యాహ్నానికే ఖాళీ

గత ఏడాదిలాగే ఈసారి కూడా తిరుచానూరు గోశాల, జడ్పీహైస్కూల్, నవజీవన్ ఆసుపత్రి వద్ద హోల్డింగ్ పాయింట్లు (షెడ్లు) ఏర్పాటు చేశారు. ఈ పాయింట్ల ద్వారానే ప్రత్యేక క్యూలైన్ గుండా భక్తులను పుష్కరిణిలోనికి అనుమతించారు. భక్తులతో నిండిన హోల్డింగ్ పాయింట్లు మధ్యాహ్నం ఒంటిగంటకే ఖాళీ అయ్యాయి. చిన్నపాటి చెదురుముదురు ఘటనలు తప్ప అమ్మవారికి చక్రస్నానం చాలా ప్రశాంతంగా ముగిసింది. శిల్పారామం నుంచి పుష్కరిణి వరకు రోడ్లన్నీ భక్తసందోహంతో నిండిపోయాయి.



పుష్కరిణిలోకి వెళుతున్న భక్తులు

22ఏ నుంచి తొలగించండి

తిరుపతి రెవెన్యూ సదస్సులో 20 అర్జీలు



అర్జీలను పరిశీలిస్తున్న అధికారులు

తిరుపతి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం 'మీ భూమి-మీ హక్కు' పేరిట ప్రవేశపెట్టిన రెవెన్యూ సదస్సులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. తిరుపతి అర్బన్ పరిధిలో తుడా కార్యాలయం వెనుకగల కచ్చపి ఆడిటోరియంలో జరిగిన రెవెన్యూ సదస్సుకు 20 అర్జీలు అందాయి. వీటిలో ద్వారకానగర్, రామచంద్రనగర్, శివజ్యోతి నగర్‌కు చెందినవారు తమ ఆస్తులను 22ఏ నుంచి తొలగించాలని 12 మంది అర్జీద్వారా విన్నవించుకున్నారు. శివజ్యోతినగర్‌కు చెందిన పార్థసారథి తమ వీధిలో రోడ్డు వెడల్పు చేయాలని, నిషేధిత జాబితాలో ఉంచిన సర్వే నెంబరు 695/7, 8, 1లోని భూమిని తొలగించాలని అర్జీ ద్వారా విజ్ఞప్తి చేశారు. కరకంబాడీ తారకరామనగర్‌లోని ఇంటికి ఓటీఎస్ (ఒన్‌టైం సెటిల్మెంట్) రిజిస్ట్రేషన్ కోసం రూ.20వేలు 2021 నవంబరు 26న చెల్లించామని, అయితే రిజిస్ట్రేషన్ చేయమంటే రేణిగుంట, తిరుపతికి తిప్పుతున్నారని కొర్లగుంట మారుతీనగర్‌కు చెందిన కె.సుగుణ కోరారు. మధురానగర్‌కు చెందిన కె.శ్రీనివాసులు, ఐఎస్ మహల్ రోడ్డుకు చెందిన వి.సెల్వీలు కొత్త రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో అర్బన్ తహసీల్దార్ భాగ్యలక్ష్మి, సబ్ రిజిస్ట్రార్ నీరజ, డీటీలు కిరణ్, రామచంద్రయ్య, ఆర్ఐ కృష్ణమ్మ, సర్వేయర్ జగదీష్, గంగమ్మగుడి ఆలయ ఈవో జయకుమార్, సర్వే ఇన్‌స్పెక్టర్ కృపాకర్‌లతో పాటు టీడీపీ నేతలు నరసింహ యాదవ్, శ్రీధర్ వర్మ, సింగంశెట్టి సుబ్బరామయ్యలు పాల్గొన్నారు. రెండో సదస్సు ఈ నెల 11న పోస్టల్ కాలనీలోని జెడ్పీ హైస్కూల్‌లో జరగనుంది.

అంబేడ్కర్ ఆదర్శప్రాయుడు

తిరుపతి(వైద్యం), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మానవ హక్కుల రక్షణకు రాజ్యాంగాన్ని అందించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆదర్శనీయుడని రుయా సూపరింటెండెంట్ రవిప్రభు అన్నారు. అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా రుయాస్పత్రిలో ఏపీ హంస ఆధ్వర్యంలో శుక్రవారం ఆస్పత్రిలోని సిబ్బందితో కలిసి ఆయన అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు రాజా ఆధ్వర్యంలో ఆస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టె పంపిణీ చేశారు. ఎస్వీ వైద్య కళాశాలలో ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్, స్విమ్స్‌లో డైరెక్టర్ ఆర్వీకుమార్, ఈఎస్ఐ ఆస్పత్రిలో ఎంఎస్ శ్యాంబాబు, డీఎంహెచ్‌వో కార్యాలయంలో డీఎంహెచ్‌వో శ్రీహరి ఆధ్వర్యంలో అంబేడ్కర్‌కు నివాళి అర్పించారు.

ఆర్టీసీ బస్టాండులో అన్నదానం

తిరుపతి(ఆర్టీసీ): అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని సెంట్రల్ బస్టేషన్‌లో ఆర్టీసీ బహుజన ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి పరశురామ్ ఆధ్వర్యంలో శుక్రవారం అన్నదానం చేశారు. ముందుగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలువేసి, నివాళి అర్పించారు. ముఖ్య అతిథిగా ఇన్‌చార్జ్ డీపీటీవో జగదీష్ హాజరై పుష్పాంజలి ఘటించారు.

ఎస్పీ కార్యాలయంలో..



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి (నేరవిభాగం), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ఎస్పీ సుబ్బరాయుడు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. దేశానికి అంబేడ్కర్ చేసిన సేవలను గుర్తు చేశారు. నేటి యువత ఆయన్ను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు.

భూమన నివాళి



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కరుణాకరరెడ్డి, శిరీష

తిరుపతి(జీవకోన), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ఆర్టీసీ బస్టాండు వద్ద గల అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలలు వేసి, నివాళులర్పించారు. అంబేడ్కర్ అందరికీ స్ఫూర్తిదాయకుడిని కొనియాడారు. మేయర్ డాక్టర్ శిరీష, నాయకులు ఎస్కే బాబు, నల్లాని బాబు, ప్రసాద్ పాల్గొన్నారు.

జీవకోనలో..

జీవకోనలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎస్సీ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ కుమారమ్మ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. బడుగు బలహీనవర్గాల అభివృద్ధికి అలుపెరగని కృషి చేసిన మహానుభావుడు అంబేడ్కర్ అని కొనియాడారు.

బీజేపీ, టీడీపీ నివాళి

తిరుపతి(ఉపాధ్యాయనగర్): అంబేడ్కర్‌కు బీజేపీ, టీడీపీ నాయకులు ఘన నివాళులర్పించారు. ఎస్సీ మోర్చా జిల్లా కార్యదర్శి మల్లారపు రవి ప్రసాద్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు సెంట్రల్ బస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. బీజేపీ జిల్లా సాంస్కృతిక విభాగం కన్వీనర్ గుండాల గోపీనాథ రెడ్డి, సీనియర్ నాయకులు సుబ్రహ్మణ్యం యాదవ్, కట్టుమంచి చంద్రబాబు యాదవ్, పీఎల్ ఉత్తన్న, దుగ్గాణి జయరాం, తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి, విద్వాన్ కస్మా పద్మనాభం, టీడీపీ నాయకులు చిత్రపు హనుమంత రావు, దీపక్ యాదవ్, చెన్నూరు సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

తిరుపతి రూరల్‌లో..

తిరుపతిరూరల్: తిరుపతి రూరల్ మండలం పేరూరు, అవిలాల పంచాయతీలలో అంబేడ్కర్ విగ్రహానికి పుష్పాంజలితో నివాళి అర్పించారు. పేరూరులో టీడీపీ నేతలు నాగూరు శ్రీనివాసులు, కాయం వెంకటేశ్, దామినేటి నాగరాజు, మహేష్, లక్ష్మీప్రసన్న, కిశోర్ పాల్గొన్నారు. అవిలాలలో సర్పంచ్ లు చెందిలి వెంకటరమణ, పిపాసి, కోటేశ్వరరావు, జానకి, లక్ష్మీరాజా, రాజేంద్ర, సునీల్‌చౌదరి, రామచంద్రయ్య, జయకర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నివాళి

తిరుపతి (వైద్యం): కాంగ్రెస్ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు చిత్తూరు శివశంకర్, తిరుపతి నగర అధ్యక్షుడు గౌడపేరు చిట్టిబాబు ఆధ్వర్యంలో రాజీవ్‌నగర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, పుష్పాంజలి ఘటించారు. కాంగ్రెస్ పార్టీ నెల్లూరు జిల్లా ఇన్‌చార్జి మాంగాటి గోపాల్ రెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి తమటం వెంకట నరసింహులు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు జ్యోతీశ్వర్ నాయక్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.



చెన్నారెడ్డి కాలనీలోని అంబేద్కర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న అంబేద్కర్ సెవెన్ కాలనీస్ బలహీనవర్గాల అభ్యున్నతి సంఘం సభ్యులు

డిస్కం కార్యాలయంలో..

తిరుపతి(ఆటోనగర్), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తిరుపతి సదరన్ డిస్కం కార్పొరేట్ కార్యాలయ ప్రాంగణంలోని అంబేడ్కర్ విగ్రహానికి సీఎండీ కె.సంతోషరావు పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. డైరెక్టర్లు వై.లక్ష్మీనరసయ్య, పి.అయూబ్ ఖాన్, సీజీఎంలు కేఆర్ఎస్ ధర్మజ్ఞాని, జె.రమణాదేవి, డీఎస్.వరకుమార్, జానకిరామ్, కె.ఆదిశేషయ్య, జీఎంలు పి.మురళి, సురేంద్ర రావు, శ్రీకాంత్, వెంకటరాజు, మురళి, ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ నాయకులు టి.జయరామ్, ఐ.సుబ్రమణ్యం, కె.బాబు పాల్గొన్నారు.



ఎస్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో సీఎండీ సంతోషరావు తదితరులు

స్మార్ట్ సిటీ పనులను వేగవంతం చేయండి



స్మార్ట్ సిటీపై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి (కలెక్టరేట్), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : స్మార్ట్ సిటీ నిధులతో నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని స్మార్ట్ సిటీ ఛైర్మన్, కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య అధ్యక్షతన స్మార్ట్ సిటీ బోర్డు మీటింగ్ నిర్వహించారు. స్మార్ట్ సిటీలో జరుగుతున్న అభివృద్ధి పనులపై సుదీర్ఘంగా సమీక్షించారు. సిటీ ఆపరేషన్ సెంటర్ భవన నిర్మాణ పనులకు నిధులు విడుదల చేసి, త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో బోర్డు డైరెక్టర్లు, ఎస్పీ సుబ్బరాయుడు, ఎస్ఈ రామచంద్రారెడ్డి, రమశ్రీ, స్మార్ట్ సిటీ జీఎం చంద్రమౌళి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

తిరుపతి(ఆటోనగర్), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తిరుపతి విద్యుత్ టౌన్ డివిజన్ పరిధిలోని నార్త్ సెక్షన్ పరిధిలో శనివారం విద్యుత్ తీగల మరమ్మతులు, చెట్ల కొమ్మలు తొలగించనున్న నేపథ్యంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఈఈ వి.చంద్రశేఖర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్‌జీవో కాలనీ, రామచంద్రనగర్, ప్రశాంతి నగర్, కేటీ రోడ్డు తదితర ప్రాంతాల్లో సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.



భక్తజనసాగరం

వేడుకగా పంచమీతీర్థం

శుక్రవారం వేకువజాము నుంచే పంచమి వేడుకలు తిరుచానూరులో మొదలయ్యాయి. పద్మావతీ అమ్మవారిని సుప్రభాతసేవతో మేల్కొలిపి నిత్యకైంకర్యాల అనంతరం పల్లకి ఉత్సవం నిర్వహించారు. ఉదయం ఎనిమిది గంటలకు సన్నిధి ముఖమండపంలో చూర్ణాభిషేకం, ఆస్థానం నిర్వహించారు. అనంతరం అమ్మవారు, చక్రత్తాళ్వార్లను వేంచేపుగా పద్మసరోవరం పంచమీతీర్థ మండపంలో కొలువుదీర్చారు. సరిగ్గా10.35 గంటలకు తిరుమల నుంచి శ్రీవారు పంపిన సారె ఈ మండపానికి చేరుకుంది. అనంతరం ముత్తైదువ సారెతో స్నపన తిరుమంజనం నిర్వహించారు. మధ్యాహ్నం 12.20 గంటలకు అభిజిత్ లగ్నం శుభ గడియల్లో పాంచరాత్ర ఆగమ శాస్త్రోక్తంగా చక్రత్తాళ్వార్‌ను పుష్కరిణిలో అర్చకులు మూడుసార్లు మునక వేయించారు.ఇదే సమయంలో అశేష భక్త జనం 'శ్రీ పద్మావతీ పాహిమాం, గోవిందా... గోవింద' అంటూ పుష్కరిణిలో మునకలేశారు. కాగా పొద్దుపోయే వరకూ సుమారు లక్ష మంది వరకు పుణ్యస్నానాలు ఆచరించినట్లు టీటీడీ అంచనా.

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి







పద్మావతికి 1.11 కోట్ల పుట్టినరోజు కానుకలు

పుట్టినరోజున పద్మావతమ్మకు శ్రీనివాసుడు ఈ ఏడాది వజ్రాభరణాలను కానుకగా పంపడం విశేషం. తిరుమల నుంచి పాండియన్ కిరీటం, వజ్రాల లక్ష్మీపతకం, హారం, గాజులు, జత కమ్మలు అందాయి. వీటి విలువ రూ.1.11 కోట్లు. ప్రతియేటా చక్రస్నానం రోజున శ్రీవారు ఆభరణాలను పంపించడం ఆనవాయితీ. వీటిని పురవీధుల్లో ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి అలంకరించారు.





ఆర్టీసీ చరిత్రలో తొలిసారిగా ఇన్‌చార్జుల పాలన

● జిల్లాలో ఆరు కీలక పోస్టులు ఖాళీ

తిరుపతి(ఆర్టీసీ), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ చరిత్రలో తొలిసారిగా జిల్లా ప్రజారవాణా సంస్థలో ఆరు కీలక పోస్టులు ఖాళీ పడగా, ఇన్‌చార్జ్‌ల పాలన కొనసాగుతోంది. గతంలో ఒకటి రెండు పోస్టులకు ఇన్‌చార్జి అధికారులను నియమించినా వారం వ్యవధిలో రెగ్యులర్ అధికారులను నియమించేవారు. ఏళ్ల తరబడి ఇన్‌చార్జీలతోనే సరిపెట్టేస్తుండటం గమనార్హం. రాష్ట్రంలోనే ఎక్కువ డిపోలు, అధిక ఉద్యోగులు, బస్సులు, మెజారిటీ ప్రయాణీకుల రవాణా, రాబడి కూడా ఎక్కువే, అధిక సంఖ్యలో వాణిజ్య దుకాణాలు, కార్గో ప్రధాన కేంద్రం ఇలా అన్ని విభాగాలలో జిల్లా మిన్నగానే ఉంటోంది. ఇన్‌చార్జ్‌ల పాలన విషయం విజయవాడ ప్రధాన కార్యాలయంలో తెలిసినా పట్టించుకోవడం లేదనే అసంతృప్తి అధికారుల్లో ఉంది. ప్రపంచ పుణ్యక్షేత్రం తిరుపతి కావడంతో ప్రజారవాణా సంస్థకు సంబంధించిన వ్యవహారాలు బిజీగానే ఉంటాయి. అలాగే తిరుమల ప్రోటోకాల్ పనులు కూడా తరచూ ఉంటాయి. ప్రత్యేక ఉత్సవాలు, పర్వదినాలు వంటి రోజుల్లో బస్సులు అదనంగా నడపాల్సి ఉంటుంది. ఇంత క్లిష్టంగా ఉండే తిరుపతి జిల్లాలో ఏపీఎస్ ఆర్టీసీ విభాగం ప్రధాన అధికారి నుంచి మరో ఐదు అధికారుల పోస్టులకు ఇన్‌చార్జ్‌లుగా కొనసాగుతుండటం కొసమెరుపు.

ఇంచార్జ్ పోస్టుల వివరాలు...

● డిస్ట్రిక్ట్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్(డీపీటీవో)గా ఉన్న సీనియర్ అధికారి టి.చెంగల్‌రెడ్డికి పదోన్నతి లభించడంతో గత అక్టోబరులో విజయవాడ ప్రధాన కార్యాలయానికి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా బదిలీ అయ్యారు. ఆ స్థానంలో చిత్తూరుజిల్లా డీపీటీవో జగదీష్‌ను ఇన్‌చార్జ్‌గా నియమించారు.

● పర్సనల్ ఆఫీసర్(పీవో)గా పార్థసారథి గత మేనెలాఖరులో పదవీ విరమణ చేశారు. అప్పటి నుంచి చిత్తూరు పీవో సహజాద్‌కు పీవోగా ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు.

●తిరుపతి కమర్షియల్ ఏటీఎం సురేంద్రబాబు గత మేనెల్లో పదవీ విరమణ చేయగా, సీటీఎస్ ఏటీఎం డి.రామచంద్ర నాయుడు అదనపు బాధ్యతలు స్వీకరించారు.

● చెన్నై అసిస్టెంట్ ట్రాఫిక్ మేజేజర్లు(ఏటీఎం) రెండేళ్ల క్రితం బదిలీలపై వెళ్లగా తిరుపతి సీటీఎస్ ఏటీఎం డి.రామచంద్ర నాయుడు అప్పటి నుంచి అదనపు బాధ్యతలు చేపట్టారు. ఈయనకు సీటీఎస్ ఏటీఎం విధులే అత్యంత కీలకం, క్లిష్టం. అయినా చెన్నై ఏటీఎంగా దాదాపు రెండేళ్ల నుంచి, తిరుపతి కమర్షియల్ ఏటీఎంగా గత జూన్ నెల నుంచి కొనసాగుతున్నారు.

●శ్రీకాళహస్తి డిపో మేనేజర్‌గా రాజవర్ధన్‌రెడ్డి గత సెప్టెంబరులో పదవీ విరమణ చేశారు. ఆ స్థానాన్ని తిరుపతి డీఎం బాలాజీకి అదనపు బాధ్యతలు అప్పగించారు.

● తాజాగా గత శనివారం డిప్యూటీ సీటీఎం భాస్కర్ పదవీ విరమణ చేయగా ఆ ఖాళీని తిరుమల డిపో మేనేజర్ విశ్వనాథంకు అదనపు బాధ్యతలు ఇచ్చారు. జిల్లాలోనే అత్యంత కీలకమైన తిరుమలడిపో వ్యవహారాలను చక్కబెట్టడడం గగనం. అయితే డిప్యూటీ సీటీఎంగా ప్రధాన బాధ్యతల నిర్వర్తించడం పనిభారమే అవుతుంది. తిరుపతిలో మధ్యాహ్నం వరకు ఆపైన కొండకు వెళ్లాల్సివుంది.



సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి - వాసంశెట్టి సుభాష్ - స్మిత

ప్రసాదాల నాణ్యత పెరిగింది

తిరుమల, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శుక్రవారం రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్, తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, గాయని స్మిత దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు. తిరుమలలో అందరూ సమానమే భావన కనిపిస్తోందని మంత్రి సుభాష్ అన్నారు. ప్రసాదాల నాణ్యత కూడా బాగా పెరిగిందన్నారు. రాష్ట్రంలోని ఇతర ఆలయాల్లోనూ ప్రసాదాల రుచి పెరిగినట్లు చెప్పారు. ఆర్థికంగా క్లిష్టపరిస్థితుల్లో ఉన్న ఏపీని గట్టెక్కించాలని, తెలుగు ప్రజలందరికీ ఆశీర్వాదాలు ఇవ్వాలని స్వామిని ప్రార్థించినట్లు మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చెప్పారు.

రిటైర్డు అదనపు ఎస్పీ జీవీ రమణ మృతి



తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ జిల్లాల్లో వివిధ హోదాల్లో పనిచేసి అదనపు ఎస్పీగా ఉద్యోగ విరమణ పొందిన జీవీ రమణ శుక్రవారం మృతి చెందాడు. ఆయన తిరుపతిలోని పోస్టల్ కాలనీలో కాపురముంటున్నారు. రిటైర్డు అదనపు ఎస్పీలు అభిషేకం, దేవదానం, సాంబశివారెడ్డి, నారాయణస్వామి, శ్రీనివాసులు, రిటైర్డు డీఎస్పీలు గంగరాజు, పోతప్ప, నంజుండప్ప, రవిశంకర్ రెడ్డితో పాటు జిల్లా పోలీసు అధికారుల సంఘం నాయకుడు శంకర్ రెడ్డి తదితరులు రమణ మృతదేహాన్ని సందర్శించి, నివాళులర్పించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు. శనివారం ఆయన అంత్యక్రియలు తిరుపతిలో నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

వేలిముద్ర వేయగానే ఖాతాలో నగదు మాయం

● ఇద్దరు యువకులపై కేసు

గూడూరు,డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి): ఉచిత గ్యాస్ కనెక్షన్లు మంజూరు చేయిస్తామన్నారు. బ్యాంకు ఖాతా, ఆధార్‌కార్డు అనుసంధానం చేయాలని నమ్మించారు. ఆధార్ డివైజ్‌తో వేలిముద్రలు తీసుకున్నారు. నగదూ వసూలు చేశారు. ఇక, వేలి ముద్ర వేయగానే కొందరి బ్యాంకు ఖాతాల నుంచి నగదు విత్‌డ్రా చేసినట్లు మెసేజీలు వచ్చాయి. గూడూరు మండలంలోని రెడ్డిగుంటసంగంలో ఇలా జరగడంతో గ్రామస్తులు శుక్రవారం ఇద్దరిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.రూరల్ ఇన్‌చార్జి ఎస్‌ఐ సుబ్రహ్మణ్యంరాజు తెలిపి న ప్రకారం.. సైదాపురం గ్రామానికి చెందిన గోపి, వెంకటేశ్వర్లు రెడ్డి గుంట సంగం గ్రామానికి వెళ్లారు.ఉచిత గ్యాస్ కనెక్షన్ కోసమని ఆధార్ డివైజ్‌లో ఓ మహిళ వద్ద వేలిముద్ర వేయించారు.అంతే, కాసేపటికి ఆమె ఖాతాలో రూ.1000 నగదు డ్రా అయినట్లు మెసేజ్ రావడంతో గ్రామస్తులకు అనుమానం వచ్చింది. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు గోపి, వెంకటేశ్వర్లుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

హోంగార్డులు నైపుణ్యం పెంచుకోవాలి

రిజర్వు ఏఎస్పీ శ్రీనివాసరావు

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మారుతున్న కాలానికను గుణంగా హోంగార్డులు వృత్తి నైపుణ్యతను పెంచుకోవాలని రిజర్వు జిల్లా అదనపు ఎస్పీ శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. హోంగార్డుల 62వ ఆవిర్భావ దినోత్సవం శుక్రవారం పోలీసు పరేడ్ గ్రౌండులో ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పోలీసు సిబ్బందితో పోలిస్తే హోం గార్డులకు సౌకర్యాలు తక్కువగా ఉన్నా కొన్ని సందర్భాల్లో వారికంటే ఎక్కువ సేవ చేస్తున్నారన్నారు. అనంతరం విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన హోంగార్డులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డీఎస్పీలు చిరంజీవి, పోతులురాజు, హోంగార్డులు, సిబ్బంది పాల్గొన్నారు.



హోంగార్డుల ఆవిర్భావ దినోత్సవంలో శ్రీనివాసరావు

తిరుమలలో మహారాష్ట్ర భక్తుడి అదృశ్యం



అనిల్ మార్ఖాకర్ (ఫైల్ ఫొటో)

తిరుమల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చిన మహారాష్ట్ర భక్తుడు కనిపించకుండా పోయినట్లు తిరుమల వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. మహారాష్ట్ర సోలాపూర్‌కు చెందిన అనిల్ మార్ఖాకర్(45) మరో 30 మందితో కూడిన భక్తబృందంతో గతనెల 29వ తేదీన తిరుమలకు వచ్చాడు. తలనీలాలు సమర్పించి ఉచిత క్యూ ద్వారా ఆలయంలోకి వెళ్లాడు. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో దర్శనం పూర్తిచేసుకుని తిరిగి వచ్చే క్రమంలో ఆలయ మహద్వారం వద్ద రద్దీలో బృందం నుంచి విడిపోయాడు. వెంటనే బృందంలోని సభ్యులు అతని కోసం తిరుమల మొత్తం గాలించారు. ఆచూకీ లభించకపోవడంతో సొంతూరికి వెళ్లి చూశారు. అక్కడా లేకపోవడంతో ఆయన కుమారుడు రోహన్ శుక్రవారం తిరుమలకు చేరుకుని వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు గాలిస్తున్నారు. వివరాలు తెలిసినవారు 94407 96769కు తెలియజేయాలని పోలీసులు కోరారు.

త్వరలో భారీగా సీఐల బదిలీలు

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): త్వరలో భారీ ఎత్తున సీఐల బదిలీలు జరగనున్నాయి. తిరుపతి ఈస్ట్, తిరుమల టూటౌన్, తిరుపతి క్రైం స్టేషన్‌లో రెండు, భాకరాపేట సర్కిల్ కార్యాలయాల్లో రెగ్యులర్ సీఐలు లేరు. ఇక్కడ రెగ్యులర్ సీఐలను నియమిస్తూ భారీగా బదిలీలు జరగనున్నట్లు తెలిసింది. తిరుపతి ఈస్ట్ స్టేషన్‌లో పనిచేస్తున్న సీఐని వీఆర్‌కు పంపిన అధికారులు.. ఇప్పటి వరకు ఇక్కడ రెగ్యులర్ సీఐని నియమించలేదు. ప్రస్తుతం తిరుపతి వెస్ట్ సీఐ రామకృష్ణ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. ఇక భాకరాపేట సీఐగా జిల్లా కేంద్రంలో సోషల్ మీడియాలో సీఐగా పనిచేస్తున్న ఇమ్రాన్‌బాషాను ఇన్‌చార్జిగా నియమించారు. తిరుమల టూ టౌన్‌కు జిల్లా పోలీసు శిక్షణ కేంద్రంలో ఉన్న శ్రీరాముడిని ఇన్‌చార్జిగా నియమించారు. వీరందరినీ పరిపాలనా సౌలభ్యం దృష్టిలో ఉంచుకుని జిల్లా ఎస్పీ అటాచ్‌మెంట్లు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇక తిరుపతిలో కీలకమైన క్రైం స్టేషన్‌లోనూ ఇద్దరు సీఐలు లేరు. డీఎస్పీనే చూసుకోవాల్సి వస్తోంది. ఇక, ఐదు నెలల కాలంలో పనితీరు, గంజాయి అక్రమ రవాణా, డ్రగ్స్ సరఫరా, పాత కేసుల్లో దర్యాప్తు వేగవంతం చేసి బాధితులకు న్యాయం చేయడంలో విఫలమైన ఒకరిద్దరు సీఐలపై వేటు పడనున్నట్లు సమాచారం. వారి స్థానంలో సమర్థులను నియమించాలని అధికారులు భావిస్తున్నట్లు తెలిసింది. తూర్పు మండలాలకు చెందిన ఇద్దరు అధికారులకు స్థాన చలనం తప్పదనే ప్రచారం జరుగుతోంది.



హైకోర్టు ఉత్తర్వులను అధికారులకు అందజేస్తున్న సంఘమిత్రలు

ఆ సంఘమిత్రలను కొనసాగించండి

● తీర్పునిచ్చిన హైకోర్టు

శ్రీకాళహస్తి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): విధుల నుంచి తొలగించిన ఐదుగురు సంఘమిత్రలను తిరిగి కొనసాగించాలంటూ రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం తీర్పు ఇచ్చింది. ఈ మేరకు సంఘమిత్రలు సీఐటీయూ నాయకులతో కలిసి వెలుగుశాఖ పీడీ శోభన్‌బాబుకి వినతిపత్రం సమర్పించారు. తొట్టంబేడు మండలంలోని పొయ్య, లింగమనాయుడుపల్లి, తాటిపర్తి, కొణతనేరి, కాసరం పంచాయతీల్లో పనిచేసే సంఘమిత్రలను ఇటీవల అధికారులు విధుల నుంచి తొలగించారు. దాంతో బాధితులు న్యాయం కోసం హైకోర్టును ఆశ్రయించారు. వారికి పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించడంతో పాటు సంఘమిత్రలుగా కొనసాగించాలని కోర్టు ఉత్తర్వులను జారీ చేసింది. ఈ మేరకు సీఐటీయూ నాయకులు వెలుగుశాఖ పీడీని కలిసి కోర్టు ఉత్తర్వుల పత్రంతో పాటు తమ వినతిని సమర్పించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ సేవలు చిరస్మరణీయం



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి (కలెక్టరేట్), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. శుక్రవారం అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని ఆర్టీసీ బస్టాండు వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. ఆర్డీవో రామ్మోహన్, చెన్నయ్య, చంద్రశేఖర్, బాలకొండయ్య పాల్గొన్నారు.

రైల్వే ఎన్నికల్లో..

చివరి రోజు 86 శాతం పోలింగ్

తిరుపతి(సెంట్రల్), డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రైల్వే గుర్తింపు సంఘం ఎన్నికల్లో భాగంగా చివరి రోజైన శుక్రవారం దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు డివిజన్‌లోని 34 పోలింగ్ కేంద్రాల్లో 86.16 శాతం ఓట్లు పోలయ్యాయి. చిత్తూరు, తిరుపతి, రేణిగుంట, పాకాల, శ్రీకాళహస్తి, వెంకటగిరి స్టేషన్లలో ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. డ్రైవర్లు, గార్డులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. తిరుపతిలో 849, రేణిగుంటలో 825, శ్రీకాళహస్తిలో 132, వెంకటగిరిలో 143, చిత్తూరులో 164, పాకాలలో 327 ఓట్లు పోలైనట్లు అధికారులు తెలిపారు. బాక్సులకు సీల్‌వేసి రేణిగుంట ఇన్‌స్టిట్యూట్‌లోని స్ట్రాంగ్‌రూమ్‌కు తరలించారు.

పుత్తూరు వార్తలు

సమస్యల పరిష్కారం కోసం 31 అర్జీలు



వివాదాస్పద విద్యుత్ సదాశివపురం భూములపై అర్జీ ఇస్తున్న రైతులు

పుత్తూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): పుత్తూరు మండలం తడుకు ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం తొలి రెవెన్యూ సదస్సు జరిగింది. ప్రధానంగా మూడు గ్రామాల్లో ఏళ్ల తరబడి నెలకొన్న శ్మశాన సమస్యలు, విద్యుత్ సదాశివ పురం భూములకు సంబంధించిన సమస్యలపై అర్జీలు వచ్చాయి. రంగుంట, తడుకు గ్రామాల్లో నెలకొన్న శ్మశాన సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామని తహశీల్దార్ వెంకటేశ్వర్లు తెలిపారు. వివాదాస్పద విద్యుత్ సదాశివపురం భూములలో 103 మంది దళిత, బలహీన వర్గాల పేదలకు ఇచ్చిన పట్టాలకు ఈ పాస్ పుస్తకాలు ఇవ్వాలని ఆ ప్రాంత వెల్ఫేర్ అసోసియేషన్ తరపున కార్యదర్శి గంగాధరం ఆధ్వర్యంలో అర్జీలను ఇచ్చారు. సదస్సులో వచ్చిన 31 అర్జీల్లో చుక్కల భూమిని రికార్డుల నుంచి తొలగించాలని ఓ అర్జీ, మ్యుటేషన్, పాస్‌పుస్తకాల కోసం రెండేసి అర్జీలు, రికార్డులలో మార్పుల కోసం ఓ అర్జీ వచ్చింది. ఈ సమావేశంలో గ్రామసర్పంచ్ వెంకటేశం యాదవ్, ఆర్ఐ తిరుమలసాయి, ప్రజాప్రతినిధులు, రైతులు, మహిళలు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌కు ఘన నివాళి



క్రీడాకారులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

వడమాలపేట, డిసెంబర్ 6(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ కర్త అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా వడమాలపేటలో ఆయన విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నాయకులు దిలీప్, జయంత్, డేవిడ్, వెంకటస్వామి, దేవరాయలు, గురువయ్య, యుగంధర్, వెంకటేష్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ పోటీలకు ముగ్గురు క్రీడాకారుల ఎంపిక

పుత్తూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అంతర్ విశ్వవిద్యాలయ ఫుట్‌బాల్ పోటీలకు పుత్తూరు ప్రభు త్వ డిగ్రీ కళాశాలకు చెందిన ము గ్గురు క్రీడాకారు లు ఎంపికయ్యా రు. తిరుపతి వెంకటేశ్వర యూనివర్సిటీ జట్టుకు బికామ్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న క్రీడాకారులు దిలీప్, ఉదయ్‌కుమార్, శ్రీనివాసులు ఎంపిక కావడం కళాశాలకు ఎంతో గర్వకారణమని ప్రిన్సిపాల్ చంద్రమౌళి అన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 21 నుంచి 29వ తేదీ వరకు కేరళలోని కాలికట్‌లో జరిగే సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన అభినందన కార్యక్రమంలో అధ్యాపకులు కోటేశ్వరయ్య, సూర్యబాబు పాల్గొన్నారు.

స్మార్ట్ సిటీ పనులను వేగవంతం చేయండి



స్మార్ట్ సిటీపై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి (కలెక్టరేట్), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : స్మార్ట్ సిటీ నిధులతో నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని స్మార్ట్ సిటీ ఛైర్మన్, కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య అధ్యక్షతన స్మార్ట్ సిటీ బోర్డు మీటింగ్ నిర్వహించారు. స్మార్ట్ సిటీలో జరుగుతున్న అభివృద్ధి పనులపై సుదీర్ఘంగా సమీక్షించారు. సిటీ ఆపరేషన్ సెంటర్ భవన నిర్మాణ పనులకు నిధులు విడుదల చేసి, త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో బోర్డు డైరెక్టర్లు, ఎస్సీ సుబ్బరాయుడు, ఎస్ఈ రామచంద్రారెడ్డి, రమశ్రీ, స్మార్ట్ సిటీ జీఎం చంద్రమౌళి పాల్గొన్నారు.

నేటి నుంచి జాతీయ సదస్సు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ లైబ్రరీ ఆధ్వర్యంలో శనివారం నుంచి రెండు రోజుల పాటు జాతీయ సదస్సు నిర్వహించనున్నారు. టెక్నాలజీ, ఎడ్యుకేషన్ అండ్ మీడియా ఫర్ అకడమిక్ అండ్ పబ్లిక్ లైబ్రరీ ఎంపవర్‌మెంట్ అంశంపై ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఉదయం 10 గంటలకు సెనేట్ హాల్లో ప్రారంభ సభ నిర్వహిస్తారు. వివిధ ప్రాంతాలకు చెందిన ప్రతినిధులు పరిశోధనా పత్రాలు సమర్పిస్తారని సదస్సు ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రొఫెసర్ కొంగర సురేంద్ర బాబు నాయుడు తెలిపారు.

అక్రమ కేసులు కొట్టేయండి

శాప్ ఛైర్మన్‌కు విద్యార్థి సంఘాల విన్నపం



రవినాయుడికి విన్నవిస్తున్న విద్యార్థి సంఘాల నేతలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో విద్యార్థి సంఘాల నాయకులపై బనాయించిన అక్రమ కేసులను కొట్టివేసే విధంగా చూడాలని శాప్ ఛైర్మన్ రవినాయుడిని పలు విద్యార్థి సంఘాల నాయకులు విన్నవించారు. వారు మాట్లాడుతూ యూనివర్సిటీల్లో పీహెచ్‌డీ చేస్తున్న విద్యార్థులకు నాన్ నెట్ ఫెలోషిప్‌లు మంజూరు చేయాలన్నారు. ఎస్వీయూలో మత ప్రచారం, దాడి వంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. సమస్యలను వర్సిటీ అధికారులు, మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తోడ్పడతానని రవినాయుడు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మల్లికార్జున (ఎన్ఎస్‌యూఐ), ఆర్కే నాయుడు (టీఎన్ఎస్ఎఫ్), అక్బర్, అశోక్, వినోద్, (ఎస్ఎఫ్ఐ) తదితరులు పాల్గొన్నారు.

నేడు వెటర్నరీ ఉద్యోగ సంఘ ఎన్నికల పోలింగ్

తిరుపతిరూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఎస్వీ వెటర్నరీ వర్సిటీ బోధనేతర ఉద్యోగుల సంఘ ఎన్నికల పోలింగ్ శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు జరగనుంది. తిరుపతి, గన్నవరం కేంద్రంగా రాయలసీమ, కోస్టల్ ఆంధ్రాజోన్‌లలో జరిగే ఈ ఎన్నికల పోలింగ్‌లో మొత్తం 166మంది ఉద్యోగులు ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. అన్ని ఏర్పాట్లు చేసినట్లు వర్సిటీ రిటర్నింగ్ అధికారి ప్రొఫెసర్ డాక్టర్ ఆర్.వేణు పేర్కొన్నారు. అదే రోజు సాయంత్రానికి ఫలితాలు తేలనున్నాయి.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

భూ సమస్యల పరిష్కారానికే

రెవెన్యూ సదస్సులు: జేసీ



వెంకటరెడ్డిపల్లి రెవెన్యూ సదస్సులో జేసీ శుభం బన్సల్, సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా

బాలాయపల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) భూసమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహించడం జరుగుతోందని జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ అన్నారు. శుక్రవారం బాలాయపల్లి మండలంలోని అలిమిలి, వెంకటరెడ్డిపల్లి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. వెంకటరెడ్డిపల్లిలో జరిగిన సదస్సులో జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా పాల్గొని రైతుల నుంచి వినతులు స్వీకరించారు. భూ సమస్యలపై 42, ఇళ్ల స్థలాల కోసం 20వినతులు వచ్చాయి. అనంతరం జేసీ మాట్లాడుతూ రైతుల భూ సమస్యలు పరిష్కరించుకునేందుకు ఇదొక మంచి అవకాశం అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివా సులు, ఆర్ఐ శ్రీకాంత్, సర్వేయర్ తారకరామారావు, టీడీపీ మండల అధ్యక్షుడు రాయి మస్తాన్ నాయుడు, పార్లపల్లి రఘునాథరెడ్డి, దాసరి రాజగోపాల్ నాయుడు, దాసరి ప్రభాకర్ నాయుడు పాల్గొన్నారు.

వాచ్‌మెన్‌పై ఆకతాయిల దాడి

కోట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల వాచ్‌మెన్ కోటయ్యపై ఆకతాయిలు రాళ్లతో దాడి చేసినట్లు శుక్రవారం బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గురువారం రాత్రి విధుల్లో ఉండగా ఆకతాయిలు రాళ్లతో దాడి చేయడంతో గాయాలయ్యాయని కోటయ్య ఫిర్యాదులో పేర్కొన్నాడు. విచారించి కేసు నమోదు చేస్తామని ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు.

రామాలయంలో చోరీ

గూడూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈదపల్లి గ్రామంలో గల కోదండరామాంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం చోరీ జరిగినట్లు స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రూరల్ ఇన్‌చార్జీ ఎస్ఐ సుబ్రహ్మణ్యంరాజు వివరాల మేరకు... గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఈదపల్లిలోని కోదండరామాంజనేయస్వామి తలుపును పగలగొట్టి లోనికి ప్రవేశించారు. స్వామి, అమ్మవార్లకు చెందిన 12 గ్రాముల బంగారం, రెండన్నర కేజీ వెండి ఆభరణాలను, వస్తువులను, ఆలయ ఆవరణలోని హుండీని పగలగొట్టి అందులోని నగదును అపహరించుకుని వెళ్లారు. చోరీ జరిగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ సుబ్రహ్మణ్యంరాజు పరిశీలించారు. క్లూస్‌టీంను పిలిపించి వేలిముద్రలను సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

పీఎం ఫసల్ బీమా యోజనను సద్వినియోగం చేసుకోండి

ఓజిలి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పీఎం ఫసల్ బీమా యోజనను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏవో విజయలక్ష్మి కోరారు. ఓజిలిలోని రైతు సేవా కేంద్రంలో శుక్రవారం ఫసల్ బీమా యోజన, ఈ-క్రాప్ నమోదుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు ఈనెల 31లోపు వరి పంటకు ఎకరానికి రూ.630, ఇతర పంటలకు ఎకరానికి రూ.650 ఈనెల 15లోపు చెల్లించి తమ పేర్లను నమోదు చేయించుకోవాలన్నారు. అలాగే ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ డివిజన్ కోర్డినేటర్ పసల సురేష్, రైతులు పాల్గొన్నారు.

అమ్మవారికి అయ్యవారి సారె



సారెతో టీటీడీ అధికారులు, ఛైర్మన్

తిరుమల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన శుక్రవారం పంచమితీర్థం ఉత్సవాన్ని పురస్కరించుకుని తిరుమల శ్రీవారి ఆలయం నుంచి సారె సమర్పించారు. ఏటా పంచమితీర్థం రోజున తిరుమల నుంచి సారె తీసుకెళ్లడం ఆనవాయితీగా వస్తోంది. శ్రీవారి ఆలయంలో వేకువజాము 2.30 నుంచి పరిమళాన్ని (నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలీగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన మిశ్రమం) విమాన ప్రాకారంలో ఊరేగింపు చేపట్టారు. అనంతరం లక్ష్మీ అమ్మవారికి ఏకాంతంగా తిరుమంజనం నిర్వహించారు. ఉదయం 4.30 గంటలకు తిరుమల శ్రీవారి ఆలయం నుంచి పసుపు, కుంకుమ, ప్రసాదాలు, తులసి, వస్త్రాలు, ఆభరణంతో కూడి సారె ఊరేగింపు మొదలైంది. ఈ సారెను గజాలపై ఆలయ నాలుగు మాడ వీధుల గుండా ఊరేగించి కాలినడకన తిరుమల నుంచి తిరుపతిలోని అలిపిరికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు పూజిత్



పూజిత్‌ను అభినందిస్తున్న పాఠశాల నిర్వాహకులు

తిరుపతి(క్రీడలు), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అండర్ 17 బేస్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలల్లో మంగళం బాలచంద్ర మెమోరియల్ హైస్కూల్(బీసీఎం)విద్యార్థి పూజిత్ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. శుక్రవారం పాఠశాల వ్యవస్థాపకుడు కృష్ణమూర్తినాయుడు, కరస్పాండెంట్ ప్రియా పూజిత్‌ను సత్కరించారు. రాష్ట్రస్థాయి పోటీలలో సత్తా చాటాలని ఆకాంక్షించారు. ప్రిన్సిపాల్ సుకన్య, వ్యాయామ ఉపాధ్యాయురాలు ప్రమీన పాల్గొన్నారు.

జాతీయ గ్రీన్ లిటరేచర్ ఫెస్టివల్‌కి నీలకంఠ



తిరుపతి(విద్య), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రీన్ లిటరేచర్ ఫెస్టివల్‌కు కరకంబాడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బయాలజీ టీచర్ నీలకంఠం ఎంపికయ్యారు. ప్రకృతి, పర్యావరణ పరిరక్షణ జాతీయ స్థాయి సదస్సు బెంగళూరులో శనివారం జరుగనుంది. ఈ అంశంపై అనేక రచనలు చేసిన నీలకంఠకు ఆహ్వానం లభించింది. ఆయన నేషనల్ గ్రీన్‌కోర్ స్టేట్ కోఆర్డినేటర్‌గా పనిచేస్తున్నారు.

వెంకటగిరి అభివృద్ధికి

గత ప్రభుత్వం సహకరించలేదు: ఆనం



మండల పరిషత్ కార్యాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి ఆనం, ఎమ్మెల్యే కురుగొండ్ల

వెంకటగిరి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం సహకరించకపోవడం వల్లే వెంకటగిరి నియోజకవర్గంలో ఎటువంటి అభివృద్ధి పనులు చేపట్టలేకపోయానని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన వెంకటగిరిలో నూతనంగా నిర్మించిన మండల పరిషత్ భవనాన్ని శుక్రవారం ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణతో కలిసి ప్రారంభించారు. ఎంపీపీ తంబిరెడ్డి తనూజారెడ్డిని ఆమె చాంబర్‌లోకి తీసుకెళ్లి కూర్చొబెట్టారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ గత ఐదేళ్లు ఎమ్మెల్యేగా తాను వెంకటగిరి నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేయాలని భావించానని, అయితే గత ప్రభుత్వం సహకరించలేదన్నారు. తాను రూ.కోటి ఎంపీ నిధులు తీసుకువస్తే అభివృద్ధి పనులు చేపట్టనియ్యకుండా అడ్డుకున్నారని విమర్శించారు. రోడ్ల నిర్మాణానికి నిధులు తీసుకువచ్చి పనులు చేయమంటే కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో పనులు జరగలేదన్నారు. ఏ ప్రాతం ఏ జిల్లాలో ఉందో తెలుసుకొనే లోపే ఐదేళ్లు ముగిశాయని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వ దుర్మార్గ పాలన వల్ల రాష్ట్రం ఎంతో నష్టపోయిందని చెప్పారు. ప్రజలు కోరుకొన్న కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అభివృద్ధి పరుగులు పెడుతోందన్నారు. స్థానిక ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణతో కలిసి ఈ ప్రాంత అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సుభం బన్‌సల్, సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనా, జడ్పీ సీఈవో రమ, జిల్లా పరిషత్ ఉపాధ్యక్షుడు ప్రసన్న, మున్సిపల్ చైర్‌పర్సన్ నాక్కా భానుప్రియ, టీడీపీ రూరల్ అధ్యక్షుడు పప్పు చంద్రమౌళిరెడ్డి, తంబిరెడ్డి శివారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పులికొల్లు రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల భూములకు రక్షణ కల్పించేందుకే రెవెన్యూ సదస్సులు: పాశం





చిల్లకూరు మండలం ఓడూరు సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ - సూళ్లూరుపేటలో ప్రజల నుంచి అర్జీలు తీసుకొంటున్న ఎమ్మెల్యే, పక్కనే ఆర్డీవో కిరణ్మయి

చిల్లకూరు, సూళ్లూరుపేట, దక్కిలి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రజల భూములకు రక్షణ కల్పించడంతో పాటు వారి సమస్యలను పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులను నిర్వహించడం జరుగుతోందని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. శుక్రవారం చిల్లకూరు మండలంలోని ఓడూరు గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం ల్యాండ్ టైట్లింగ్ యాక్టును ప్రవేశపెట్టి పేదల భూములకు రక్షణ లేకుండా చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పేదల భూములకు రక్షణ కల్పించేందుకు ల్యాండ్ టైట్లింగ్ యాక్టును రద్దు చేసిందన్నారు. ఎవరైనా పేదల భూములను ఆక్రమిస్తే కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్ ద్వారా శిక్షించడం జరుగుతుందన్నారు. అధికారులు రెవెన్యూ సదస్సులను మొక్కుబడిగా కాకుండా ప్రజల సమస్యలను పరిష్కరించేలా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలన్నారు. రెవెన్యూ సదస్సులకు రాని అధికారులకు నోటీసులు జారీ చేయాలని తహసీల్దారుకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దారు శ్రీనివాసులు, శీలం కిరణ్‌కుమార్, పులిమి శ్రీనివాసులు, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, గుండాల లీలావతి, చిట్టేటి కీరవాణి, దాసరి శైలజ, కోటేశ్వరరాజు, యదనపర్తి భాస్కర్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం, ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు. ● సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలోని వట్రపాలెం, పడమటి కండ్రిగ, నూకలపాలెం గ్రామానికి సంబంధించి మన్నారుపోలూరు సచివాలయంలో ఆర్డీవో కిరణ్మయి ఆధ్వర్యంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నరసింహారావు, మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు. ● దక్కిలి మండలం నాగవోలులో జరిగిన గ్రామసభలో ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పాల్గొని ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులను స్వీకరించారు. వాటిని పరిశీలించి బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సామాన్య ప్రజలను సైతం భయభ్రాంతులను చేస్తూ రాష్ట్రంలో వైసీపీ నేతలు వేల ఎకరాలను కాబ్జా చేశారని ఆరోపించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు కోట్ల రూపాయలు విలువచేసే రెవెన్యూ, చెరువు పోరంబోకు, కాలువ పోరంబోకు భూములను సైతం వదలకుండా ఆక్రమించుకున్నారని విమర్శించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, డిప్యూటీ తహసీల్దార్ ప్రసన్న, సర్వేయర్ రాజగోపాల్, అంగన్‌వాడీ ప్రాజెక్టు అధికారిణి సంషాద్ బేగం, వీఆర్వో విజయకుమార్, మాజీ జడ్పీటీసీ ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, టీడీపీ అధికార ప్రతినిధి ఆరికట్ల శ్రీరామ చౌదరి, తెలుగుయువత నాయకుడు వేముల కిషోర్ నాయుడు, స్థానిక నాయకులు తిరుపాల్, గడ్డం చంద్రశేఖరరెడ్డి. రంగినేని రాజా, మునికృష్ణయ్య, పోకూరు రమేష్, ఆలూరు దామోదర నాయుడు, యోగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఏపీ పాఠశాలకు ఎక్స్‌లెన్స్ అవార్డు



అవార్డు అందుకుంటున్న శ్రీకాంత్‌రెడ్డి

గూడూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గూడూరు పట్టణం శారద నగర్‌లోని ఎల్ఏపీ పాఠశాలకు ట్రైల్ బ్లజర్ ఎక్సలెన్స్ అవార్డు లభించినట్లు కరస్పాండెంట్ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. తమ పాఠశాలలో విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించడంతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచడంతో హైదరాబాదులోని ఈటీ టెక్ ఎక్స్‌ట్రైల్ బ్లజర్ సంస్థ అవార్డును అందజేసినట్లు తెలిపారు. శుక్రవారం హైదరాబాదులో టెక్ ఎక్స్‌ట్రైల్ సంస్థ ఛైర్మన్ బ్రహ్మం చేతులమీదుగా అవార్డు అందుకున్నట్లు శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

ఆదర్శనీయుడు అంబేడ్కర్

గూడూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఆర్థిక, సామాజిక అసమానతలను రూపుమాపేందుకు ఎంతో కృషి చేసిన అంబేడ్కర్ ఆదర్శనీయుడని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. శుక్రవారం అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా స్థానిక అశోక్‌నగర్‌లోని నీళ్లట్యాంకు సమీపంలో గల ఆయన విగ్రహానికి అంబేడ్కర్ సేవాసంఘం ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వేగూరు రాజేంద్రప్రసాద్, వసంత్‌కుమార్, చెంచునారాయణ, ప్రభాకర్, ప్రతాప్, చిరంజీవి, వెంకటేశ్వర్లు, అనిల్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి జనసేన నాయకుల ఆధ్వర్యంలో నివాళులర్పించారు.

బాలాయపల్లి(ఆంధ్రజ్యోతి): స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి న్యాయవాదులు పెట్లూరు రాంప్రసాద్, పెట్లూరు కమలాకర్, కనుసూరు నాగయ్య, తలారి కోటేశ్వరరావు, పరమాల వెంకటేశ్వర్లు తదితరులు పూల మాల వేసి నివాళులర్పించారు.

ఓజిలి(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిరుమలపూడి, చిల్లమానుచేను, పెద్దపరియ గ్రామాల్లోని అంబేడ్కర్ విగ్రహాలకు నివాళులర్పించారు.

సూళ్లూరుపేట (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ బస్టాండు వద్దనున్న అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్ రెడ్డి, ఏజీ కిషోర్, అలవల శ్రీనివాసులు, కుదిరి పెంచలయ్య, రాము, దంతాల రవి తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేట (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాతబస్టాండ్ సమీపంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి, ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి బొల్లకాయల విజయభాస్కర్, మున్సిపల్ చైర్ పర్సన్ కటకం దీపిక, ఎంపీపీ కురుగొండ ధనలక్ష్మి నివాళులర్పించారు. మేనకూరులో సీడీసీ మాజీ చైర్మన్ కట్టా సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ఫజులుల్లా తదితరులు అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు.

వన్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్‌గా సెల్వం ప్రమాణస్వీకారం

తడ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వన్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్‌గా కొలవి సెల్వం శుక్రవారం విజయవాడలో ప్రమాణస్వీకారం చేశారు. సూళ్లూరుపేట నియోజకవర్గానికి చెందిన టీడీపీ నాయకులు నెలవల రాజేష్, బొమ్మన శ్రీధర్, సుదర్శన్ మొదలియార్, బొమ్మన పళణి, ఆకుతోట రమేష్, జయపాల్, శ్రీనివాసులునాయుడు తదితరులు సెల్వంను శాలువాలు, పూలమాలలతో సత్కరించి అభినందించారు.



సెల్వంను అభినందిస్తున్న టీడీపీ నాయకులు

రెవెన్యూలో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు

వెంకటగిరి టౌన్, డిసెంబరు 6,(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి మండలం పెట్లూరులో శుక్రవారం గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూలో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులను హెచ్చరించారు. ప్రజలకు తమ సమస్యలపై వచ్చేవారికి పరిష్కారం చూపించాలన్నారు. తహసీల్దార్ రాంబాబు, అధికారులు పాల్గొన్నారు.

పెళ్లకూరు(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలచ్చూరులో తహసీల్దార్ ద్వారకానాథ్‌రెడ్డి రెవెన్యూ సదస్సు నిర్వహించి రైతులు అందించిన అర్జీలను స్వీకరించారు. ఆర్ఐ సంతోషిబాయి, సర్వేయర్లు పూజిత, సూర్యనారాయణ, లక్ష్మణ్, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఓజిలి(ఆంధ్రజ్యోతి): తహసీల్దారు పద్మావతి ఆధ్వర్యంలో జరిగిన రెవెన్యూ సదస్సులో 16 అర్జీలు అందాయి. భూముల సర్వే 6, పట్టాదారు పాసు పుస్తకాల కోసం 6, అసైన్‌మెంటు భూముల కోసం 4 అర్జీలు వచ్చాయి.

తడ(ఆంధ్రజ్యోతి): తడ మండలం కాశింగాడుకండ్రిగ గ్రామంలో తహసీల్దారు శరత్‌బాబు అధ్యక్షతన రెవెన్యూ సదస్సు జరిగింది. గ్రామస్తులనుంచి 15 అర్జీలు రాగా, వాటిని త్వరలోనే పరిష్కరిస్తామని తహసీల్దారు తెలిపారు.

చిట్టమూరు(ఆంధ్రజ్యోతి): మెట్టు గ్రామంలో తహసీల్దారు ప్రసాద్ రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఎంపీడీవో మనోహర్ గౌడ్, రీసర్వే డీటీ నిరంజన్ కుమార్, సర్వేయర్ వెంకటేష్ పాల్గొన్నారు.

నాయుడుపేట టౌన్(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంగమాంబపురం, పండ్లూరు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఇన్‌చార్జి తహసీల్దారు రాజేంద్ర రైతుల నుంచి వచ్చిన అర్జీలు స్వీకరించారు.

వాకాడు(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండూరు సచివాలయం పరిధిలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. 102 అర్జీలు వచ్చాయని తహసీల్దారు రామయ్య తెలిపారు. ఎంపీడీవో అన్నపూర్ణరావు, డీటీ సందీప్, ఆర్ఐ అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

గూడూరు అర్బన్(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోటిచెర్ల, నెల్లటూరు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. తహసీల్దారు చంద్రశేఖర్ ప్రజలనుంచి అర్జీలను స్వీకరించారు.

కోట(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మద్దాలిలో శుక్రవారం రెవెన్యూ సదస్సు జరిగింది. భూసమస్యలపై 5, ఇంటి స్థలాలు, ఇతర సమస్యలపై 45 అర్జీలు వచ్చాయని తహసీల్దారు జయజయరావు తెలిపారు. డిప్యూటీ తహసీల్దారు అజమతుల్లా, ఆర్ఐ మధులత పాల్గొన్నారు.

ఇళ్లపై విద్యుత్ తీగలు మార్చేందుకు చర్యలు



స్థానికుల నుంచి సమస్యలు తెలుసుకుంటున్న విద్యుత్‌శాఖ డీఈ ప్రసాద్, తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి

గూడూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఇళ్లపై నుంచి వెళుతున్న విద్యుత్‌లైన్లను ఇతర ప్రాంతాల్లోకి మార్చేందుకు చర్యలు చేపట్టనున్నట్లు తిరుపతి పార్లమెంటు తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి చెప్పారు. శుక్రవారం మండలంలోని చెన్నూరులో గల హరిజనవాడలో విద్యుత్‌శాఖ అధికారులతో కలిసి గృహాలపై వెళుతున్న విద్యుత్‌లైన్లను పరిశీలించారు. స్థానికుల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెన్నూరులోని హరిజనవాడలో నివాసగృహాలపై విద్యుత్‌లైన్లు వెళుతుండడంతో ప్రమాదకరంగా ఉందన్నారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ డీఈ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 85 మంది ఎంపిక

వెంకటగిరి టౌన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐలో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 85మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఉమారాణి తెలిపారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది రామారావు, హరికృష్ణ, సునీల్, దశయ్య, పెంచలయ్య, పవార్ పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వంతో కార్యకర్తలకు భరోసా

నాయుడుపేట, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వంతో కార్యకర్తలకు భరోసా లభిస్తుందని ఆ పార్టీ తిరుపతి పార్లమెంటు బీసీ సెల్ కార్యదర్శి బిరదవోలు నారాయణ, పట్టణ ప్రధాన కార్యదర్శి నానాబాల సుబ్బారావు అన్నారు. శుక్రవారం నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలోని జువ్వలపాళెంలో టీడీపీ సభ్యత్వ నమోదు చేపట్టారు.

రాజరాజేశ్వరి ఆలయంలో ఆధిపత్యపోరు

- ఓ వర్గం మహిళపై మరో వర్గం దాడి



ఆలయం వద్ద మహిళల వాగ్వాద దృశ్యం

రేణిగుంట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక రాజరాజేశ్వరి ఆలయంలో ఆధిపత్య పోరులో ఓ వర్గానికి చెందిన మహిళపై మరో వర్గం దాడి చేసిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. ఆలయంలో అమ్మవారికి పూజాభిషేకాలు జరుగుతున్న సమయంలో ఒక వర్గానికి చెందిన మహిళ నైటీతో ఆలయ ప్రవేశం చేసింది. ఇది గుర్తించిన మరో వర్గానికి చెందిన మహిళలు ఆమెను అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల నడుమ చోటుచేసుకున్న వాగ్వాదం ఆ మహిళపై చేయి చేసుకునే వరకు వచ్చింది. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాల వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీంతో ఆలయ వివాదం మరోమారు తెర మీదకు వచ్చింది. ఈ ఆలయ వ్యవహారాలు చూసుకోవడానికి ముగ్గురికి జనరల్ పవర్ ఆఫ్ పట్టా ఉందని ఓ వర్గం, ట్రస్టుకు సంబంధించినదని మరో వర్గం వాదనలకు దిగుతున్నారు. ఈ విషయమై ట్రస్టు నిర్వాహకుడి కుమారుడు మూర్తిస్వామి మాట్లాడుతూ ఓ మహిళ నైటీతో ఆలయంలోకి రావడం వల్లే వివాదం చోటుచేసుకుందని చెప్పారు. ఈ ఆలయం ట్రస్టుకు సంబంధించినదని తెలిపారు. తనపై వచ్చిన ఆరోపణల అంశం కోర్టు పరిధిలో ఉండటం వల్ల ఇంతకుమించి తాను మాట్లాడలేనని ఆయన పేర్కొన్నారు.

ఏర్పాట్ల పరిశీలన



తొండమనాడు పాఠశాలను పరిశీలిస్తున్న డీఈవో

శ్రీకాళహస్తి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి మండలంలోని తొండమనాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం జరగనున్న మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశానికి సంబంధించి ఏర్పాట్లను శుక్రవారం డీఈవో కేవీఎన్ కుమార్ పరిశీలించారు. ఈ మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశానికి కలెక్టర్ వెంకటేశ్వర్ హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో డీఈవో క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ చైర్మన్, సభ్యులకు సలహాలు, సూచనలు చేశారు. అధికారులు సురేష్, ప్రదీప్‌కుమార్, ఎస్ఎంసీ చైర్మన్ అచ్యుతయ్య తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల ప్రతిభను గుర్తించండి



దివ్యాంగ పిల్లలకు బహుమతులు అందజేస్తున్న ఎంఈవో

ఏర్పేడు, డిసెంబరు 6 (ఆంధ్ర జ్యోతి): ఏర్పేడు భవిత పాఠశాలలో సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో శుక్రవారం దివ్యాంగుల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎంఈవో ప్రేమలత మాట్లాడుతూ అంగవైకల్యం లోపం కాదని, వారిని ప్రోత్సహిస్తే అన్ని రంగాల్లో రాణిస్తారన్నారు. ఏర్పేడు భవిత కేంద్రంలో దివ్యాంగులకు అందిస్తున్న ప్రత్యేక సేవలను వినియోగించుకోవాలని ఆమె కోరారు. అనంతరం వారికి ఆటల పోటీలు నిర్వహించి బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఏర్పేడు ప్రాథమిక పాఠశాల హెచ్ఎం శోభారాణి, భవిత కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్లు రమాదేవి, స్వర్ణలత, ఫిజియోథెరపిస్టు డాక్టర్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఏడుగంగల జాతర చాటింపు

శ్రీకాళహస్తి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి పట్టణంలో అత్యంత వేడుకగా జరిగే ఏడుగంగమ్మల జాతర చాటింపు ఆదివారం జరగనుంది. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా శ్రీకాళహస్తిలో మాత్రమే ఏడు గంగమ్మల జాతర జరుగుతుంది. అందులో భాగంగా 8వ తేదీ ఆదివారం రాత్రి చాటింపు, 10వ తేదీ మంగళవారం సాయంత్రం శ్రీకాళహస్తీశ్వరాలయం తరపున ఏడుగంగమ్మలకు సారె బహూకరణ, రాత్రి 12 గంటలకు అభిషేకం, కుంభం జరుగుతుంది. 11వ తేదీ బుధవారం ఉదయం ఏడు గంగమ్మల అమ్మవార్లు నిర్ణీత ప్రదేశాలకు చేరుకుని కొలువు దీరనున్నారు. అదే రోజు రాత్రి 8 గంటలకు గంగమ్మల నిమజ్జనం జరుగుతుంది.

యోగా, ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం



యోగా, ధ్యానం కేంద్రాన్ని ప్రారంభించిన మాస్టర్లు

పిచ్చాటూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): యోగా, ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం, మానసిక ప్రశాంతత సిద్ధిస్తుందని మాస్టర్లు మల్లీశ్వరి, రమేష్‌జీ పేర్కొన్నారు. శుక్రవారం పిచ్చాటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదురుగా నూతన యోగా, ధ్యానం కేంద్రాన్ని రిటైర్డ్ హెచ్‌ఎంలు నాగయ్య, రామలింగం, సుబ్రహ్మణ్యంల సమక్షంలో ప్రారంభమైంది. యోగా మాస్టర్ రమేష్‌జీ, ధ్యానం మాస్టర్ మల్లీశ్వరిలు యోగా, ధ్యానం సాధనపై శిక్షణ ఇచ్చారు. ఈ కేంద్రంలో ప్రతి రోజు ఉదయం ఉచితంగా యోగా, ధ్యానంపై శిక్షణ ఇవ్వనున్నట్లు విశ్రాంత హెచ్ఎం రామలింగం తెలిపారు. అనంతరం ధ్యాన కేంద్రం చుట్టూ మొక్కలు నాటారు.

అనారోగ్యంతో మాజీ సర్పంచ్ గోవిందస్వామి మృతి

పిచ్చాటూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని తులసికృష్ణాపురం మాజీ సర్పంచ్ గోవిందస్వామి శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. పలువురు టీడీపీ నాయకులు ఆయన కుటుంబాన్ని పరామర్శించి, మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

- కలెక్టర్ వెంకటేశ్వర్



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

వడమాలపేట, డిసెంబర్ 6(ఆంధ్రజ్యోతి): దీర్ఘ, స్వల్ప కాలిక సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ చెప్పారు. మండలంలోని కల్లూరులో నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌తో కలిసి శుక్రవారం ఆయన రెవెన్యూ సదస్సును ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా రెవెన్యూ గ్రామాల్లో సమస్యలను 45 రోజుల్లో పరిష్కారించేలా సదస్సుల నిర్వహణకు శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. స్వీకరించే అర్జీలను ఆర్‌టీజీఎస్ పోర్టల్లో నమోదుచేసి రసీదు ఇవ్వనున్నట్లు తెలిపారు. రెవెన్యూ సేవలు ఉచితంగా చేస్తున్నట్లు చెప్పారు. ఇతర సమస్యలపై అర్జీలు వస్తే ఆయా శాఖలకు పంపి పరిష్కరిస్తామన్నారు. ఎమ్మెల్యే భానుప్రకాష్ మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో చుక్కల భూములు, భూఆక్రమణలు, పాస్ బుక్‌లలో జరిగిన అక్రమాలను అరికట్టి రైతాంగానికి అండగా ఉండడం కోసం అధికారులు ప్రజల వద్దకే వచ్చేలా సదస్సులు నిర్వహిస్తున్నామని చెప్పారు. మ్యూటేషన్, విస్తీర్ణంలో అవకతవకలు ఉంటే సదస్సులోనే పరిశీలించుకుని తేడాలుంటే అర్జీలు ఇవ్వాలని తెలిపారు. ఫ్యాక్టరీల వ్యర్థాలతో గ్రామంలో తాగునీరు కలుషితమవుతోందని, గాజులమడ్యం పారిశ్రామికవాడ నుంచి గ్రామానికి వచ్చే రోడ్డులో నక్కల వాగు వంతెన రోడ్డుకు దిగువుగా ఉందని, ఇటీవల వాగులో ముగ్గురు గల్లంతై మృతి చెందారని, హైలెవల్ బ్రిడ్జి నిర్మించాలని గ్రామస్థులు కోరారు. 24 గంటలు విద్యుత్ సౌకర్యం కల్పించాలని, కల్లూరును పంచాయతీగా చేయాలని కోరారు. ఎమ్మెల్యే ఒరవ కాలువలకు మరమ్మతు చేయించడంతో కల్లూరు చెరువు నిండిందని గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. సదస్సులో తహసీల్దార్ జరీనా, ఎంపీడీవో శేషగిరిరావు, జడ్పీటీసీ మురళీధర్ రెడ్డి, నాయకులు ధనంజయులు నాయుడు, లక్ష్మీప్రసన్న, మోహన్, అంజయ్య, మంజు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

- ఎమ్మెల్యే ఆదిమూలం

సత్యవేడు: భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ అధికారులు సమన్వయంతో కృషి చేయాలని ఎమ్మెల్యే ఆదిమూలం సూచించారు. నాగలాపురం పంచాయతీ కార్యాలయ ఆవరణలో తహసీల్దార్ హనుమాన్ నాయక్ ఆధ్వర్యంలో జరిగిన రెవెన్యూ సదస్సులో పాల్గొన్నారు. ఈస్టుకు చెందిన ఐటీడీపీ నాయకుడు నెల్సన్ మండేలా మండలంలో భూములు లేని నిరుపేద రైతులకు డీకేటీ భూములు కేటాయించాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించారు. స్పందించిన ఎమ్మెల్యే ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించి, అర్హులైన పేదలకు అందించేలా చర్యలు చేపడతామని తెలిపారు. అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

మేతబీడు భూములను రక్షించండి

శ్రీసిటీ ఆధీనంలో ఉన్న మేత బీడు భూములను తమ గ్రామానికే కేటాయించాలని మండలంలోని చెరివి ప్రాథమిక పాఠశాలలో జరిగిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ టీవీ సుబ్రమణ్యంకు వినతిపత్రం సమర్పించారు. పంచాయతీలో నెలకొన్న భూసమస్యలను పరిష్కరించాలని పలువురు రైతులు అర్జీలు సమర్పించారు. కాగా తాము ఇస్తున్న అర్జీలకు ఆన్‌లైన్ రశీదు ఇవ్వకుండా, మాన్యువల్ రశీదులు ఇవ్వడం ఏమిటని సర్పంచ్ పరంధామ్ రెవెన్యూ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ క్రమంలో గ్రామస్తులకు, అధికారులకు వాగ్వాదం జరిగింది. సర్పంచ్ రత్నమ్మ, ఎంపీడీవో చంద్రశేఖర్, ఎంఈవో రవి, డీటీ వెంకటేశులు, ఆర్ఐ సురేష్, ఎంఆర్‌పీఎస్ అధ్యక్షుడు రాగిపట్టు రాఘవయ్య మాదిగ, టీడీపీ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ రెడ్డి, నాయకులు త్యాగమూర్తి, బాషా, షణ్ముగం, శివానందం తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి మండలం మన్నవరంలో టీడీపీ సీనియర్ నాయకులు రంగినేని చెంచయ్య నాయుడు ఆధ్వర్యంలో తహసీల్దారు లక్ష్మీనారాయణ, అధికారుల బృందం మండలంలో శుక్రవారం తొలి సదస్సును ప్రారంభించారు. మొత్తం 22 మంది రైతులు మ్యూటేషన్, అన్ రిజిస్టర్ రిజిస్ట్రేషన్, సాగుభూములకు డీకేటీ పత్రాలు, సర్వేచేసి హద్దులు చూపాలంటూ విజ్ఞప్తిచేశారు. కలవగుంటలో 9 మంది రైతులు వినతిపత్రాలు సమర్పించారు. తొట్టంబేడు మండలం పెన్నలపాడులో తహసీల్దారు మధుసూదన్ రావు అధికారులతో కలిసి నిర్వహించిన సదస్సులో రైతుల నుంచి 20 ఫిర్యాదులు వచ్చాయి. మధ్యాహ్నం కొన్నలిలో కూడా రెవెన్యూ సదస్సు జరిగింది.

ఏర్పేడు: ఏర్పేడు మండలం పల్లం పంచాయతీలో జరిగిన సదస్సులో శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డికి 29మంది రైతులు వివిధ సమస్యలతో కూడిన వినతులను అందించారు. తహసీల్దారు భార్గవి, అధికారులు, నాయకులు చంద్రశేఖర్ నాయుడు, నాగేశ్వర రావు, రాజ్‌కుమార్ నాయుడు పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ: తెర్రిపాడులో నిర్వహించిన సదస్సులో తహసీల్దార్ సుబ్రమణ్యం రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఎంపీడీవో త్రివిక్రమ్‌రావు, సీనియర్ అసిస్టెంట్ నల్లయ్య, సర్పంచ్ రామ్మూర్తి, ఇతర శాఖాధికారులు, వీర్వోలు పాల్గొన్నారు.

వరదయ్యపాళెం: కారిపాకంలో తహసీల్దారు రాజశేఖర్ ఆధ్వర్యంలో జరిగిన రెవెన్యూ సదస్సులో గ్రామ కంఠం స్థలాల నివేశ స్వాధీన అనుభవ పత్రాల కోసం, భూముల సమస్యలపై అర్జీలు సమర్పించారు. కార్యక్రమంలో ఫారెస్టు సెక్షన్ అధికారి దేవరాజులు, డీఈవో శ్రీరాములు, ఆర్ఐ శివకుమార్, అటవీ బీట్ అధికారి భానుకిరణ్, సర్వేయర్ రమణ, సర్పంచ్ వేనాటి ఆనంద్, వీఆర్వో నాగభూషణం, జనసేన నాయకులు తడ శ్రీను తదితరులు పాల్గొన్నారు. విరయపాళెంలో కూడా రెవెన్యూ సదస్సు నిర్వహించారు.



నాగలాపురంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిమూలం

కేవీబీపురం: మిద్దికండ్రిగ సచివాలయ ఆవరణలో జరిగిన సదస్సులో భూసమస్యలపై తహసీల్దారు మునిరత్నం అర్జీలు స్వీకరించి, రసీదులు ఇచ్చారు. మండల టీడీపీ అధ్యక్షుడు రామాంజుల నాయుడు, పార్లమెంటరీ రైతు అధ్యక్షుడు గోపీనాథ్‌రెడ్డి, రాష్ట్ర బీసీ సెల్ ప్రధానకార్యదర్శి మునస్వామియాదవ్, కమిటీ అధ్యక్షులు దొరస్వామియాదవ్, సర్పంచ్ రాధాకృష్ణ, మండల తెలుగు యువత ప్రధాన కార్యదర్శి హరియాదవ్, అటవీశాఖ, సబ్‌రిజిస్ట్రార్, దేవదాయశాఖ, సచివాలయ, తహసీల్దారు కార్యాలయాల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రేణిగుంట: బాలపల్లిలో తహసీల్దారు సురేష్‌బాబు ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో భూసమస్యలపై ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. దరఖాస్తులను పరిశీలించి సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. మామండూరులో శనివారం రెవెన్యూ సదస్సు జరుగుతుంది.

నారాయణవనం: మండల పరిధిలోని పాలమంగళంలో తహసీల్దార్ జయరాములు గ్రామస్థుల నుంచి అర్జీలను స్వీకరించారు. మొత్తం 68 అర్జీలు వచ్చాయి. ఆర్ఐ అంజనమ్మ, సర్వేయర్లు హేమాద్రి, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పిచ్చాటూరు: మండలంలోని ముడియూరు సచివాలయంలో నిర్వహించిన రెవెన్యూసదస్సులో తహసీల్దార్ రమేష్‌బాబు రైతుల నుంచి అందిన కొన్ని అర్జీలను అక్కడికక్కడే పరిష్కరించి, మరికొన్నింటిని త్వరలో పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ సుధాకర్, సీనియర్ అసిస్టెంట్లు జ్యోతిర్మయి, కరుణాకర్, వీఆర్వో కృష్ణ, సర్వేయర్ కన్నయ్య, రైతులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా శుక్రవారం ఉత్సవం



అమ్మవారి ప్రాకార ఉత్సవం

శ్రీకాళహస్తి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారం అమ్మవారికి విశేష ఉత్సవం నిర్వహించారు. అలంకార మండపంలో జ్ఞానప్రసూనాంబిక అమ్మవారి ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ఆలయంలో ప్రాకారంగా ప్రదక్షిణ చేసి తిరిగి కొలువు తీర్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

తిరుచ్చిపై ఊరేగిన కల్యాణ వెంకన్న

నారాయణవనం, డిసెంబర్ 6(ఆంధ్రజ్యోతి): పద్మావతీ దేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి జన్మ నక్షత్రమైన శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకుని శుక్రవారం సాయంత్రం ఉత్సవర్లు మాడవీధిలో తిరుచ్చి వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయాధికారి నాగరాజు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కొత్త రైల్వేలైన్‌కు అనుమతి పట్ల హర్షం

పిచ్చాటూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): పుత్తూరు నుంచి తమిళనాడులోని అత్తిపట్టు కొత్త రైల్వే మార్గం కోసం భూసేకరణ పనులకు రైల్వేశాఖ అనుమతి ఇవ్వడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కొత్తరైల్వే మార్గం నారాయణవనం, పిచ్చాటూరు, నాగలాపురం మండలాల మీదుగా అత్తిపట్టుకు చేరుతుంది. దీంతో ఆయా మండలాలకు చెందిన ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

మినీగోకుల నిర్మాణాలను వేగవంతం చేయాలి

ఏర్పేడు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పేద రైతులకు సబ్సిడీ కింద అందిస్తున్న మినీ గోకుల నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ సూచించారు. ఏర్పేడు పంచాయతీలో ఉపాధిహామీ పథకం ద్వారా చేపడుతున్న బొడుగు బాలాజీ మినీ గోకుల నిర్మాణాన్ని ఆయన శుక్రవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో మొత్తం 25 మినీ గోకులాలు మంజూరయ్యాయని, వాటిని డిసెంబరు 13లోపు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో అధికారులు చంద్రశేఖర్‌రాజు, దేవరి, బాలాజీరావు తదితరులు పాల్గొన్నారు.

బాలికల చదువుతో సమాజాభివృద్ధి



ప్రతిజ్ఞ చేస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

శ్రీకాళహస్తి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): బాలికల చదువుతో సమాజాభివృద్ధి జరుగుతుందని ప్రిన్సిపాల్ నరసింహవర్మ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో బాలిక విద్య యొక్క అవశ్యకత సదస్సును శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బాలికల చదువు వలన సమాజంలో వచ్చే మార్పులను వివరించారు. స్త్రీ, పురుష నిష్పత్తిని వివరించి అందులో ఏర్పడుతున్న పరిణామాలను వివరించారు. బుద్ధిబలంలో మహిళలు ఎపుడు ముందుంటారని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ గంగారామ్, అధ్యాపకులు బాపనయ్య, తులసి, సునీత, సుభాషిణి, శివలక్ష్మీ, రుద్రమదేవి, సుధీర్, వెంకట నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాలు జ్ఞాననేత్రాలు



పుస్తకాలతో విద్యార్థులు

బుచ్చినాయుడుకండ్రిగ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): పుస్తకాలు జ్ఞాననేత్రాలని, మానసిక వికాసానికి పుస్తక పఠనం దోహదపడుతుందని అమృత భారతి ఫౌండేషన్ చిత్తూరు సమన్వయకర్త శతావధాని ఆముదాల మురళి అన్నారు. మండలంలోని కల్లివెట్టు ఉన్నత పాఠశాలలో అంబేద్కర్ చిత్రపటానికి శుక్రవారం పుష్పాంజలి ఘటించారు. 9, 10వ తరగతి విద్యార్థులకు రామాయణం, పెద్దబాలశిక్ష పుస్తకాలను ఆముదాల మురళి, సభ్యులు లోకేష్ అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రూపేష్ కుమార్, యువశ్రీ మురళి తదితరులు పాల్గొన్నారు.

వైవిధ్యమైన పంటల సాగుతో అధిక దిగుబడి



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయశాఖ అధికారులు

శ్రీకాళహస్తి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వైవిధ్యమైన పంటల సాగుతో అధిక దిగుబడి పొందవచ్చని వ్యవసాయశాఖ జిల్లా ట్రైనింగ్ కోఆర్డినేటర్ భాస్కరయ్య అన్నారు. పట్టణంలోని ఏపీసీడ్ కార్యాలయంలో శుక్రవారం రైతు సేవా కేంద్రాల సిబ్బందికి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వరితోపాటు ఆరుతడి పంటలుగా కూరగాయలు, పూలు, పండ్ల సాగు, పట్టు పరిశ్రమను చేపట్టేందుకు రైతులను ప్రోత్సహించాలన్నారు. సిబ్బంది వ్యవసాయ, అనుబంధ శాఖల పథకాల గురించి అవగాహన పెంచుకొని, అవి రైతులకు అందేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో వేణుగోపాలరావు, సెరికల్చర్ అధికారి కల్యాణి, రాస్ కృషి విజ్ఞానకేంద్రం అధిపతి డాక్టర్ శ్రీనివాసులు, తొట్టంబేడు మండల వ్యవసాయాధికారి సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం



శ్రీకాళహస్తి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పీవీరోడ్డులో వెలసిన అంకాలమ్మ ఆలయం వద్ద శుక్రవారం నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. నిర్వాహకులు మాట్లాడుతూ మూడు సంవత్సరాలుగా ప్రతి నెలా భక్తులకు అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో లోకేష్‌యాదవ్, గోవర్ధన్ రావు, యశ్వంత్‌రావు, కాంత్రి కుమార్, శివకుమార్‌రెడ్డి, డాక్టర్ కృపానిధి, ఉపేందర్‌రెడ్డి, రాఘవేంద్ర, సావిత్రిబాయి, మాధవ, సాయి, సుశీల, బాబు, వినీత్‌రెడ్డి, నాగేష్, రాజేశ్వర రావు, వినోద్‌కుమార్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఏకలవ్య గురుకులంలో సమస్యలు పరిష్కరించాలి



ప్రిన్సిపాల్‌తో మాట్లాడుతున్న నాయకులు

బుచ్చినాయుడుకండ్రిగ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనమనంబేడు గ్రామంలోని ఏకలవ్య గురుకుల పాఠశాలలో విద్యార్థుల సమస్యలను అధికారులు పరిష్కరించాలని దళిత, గిరిజన నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం దళిత నాయకులు పులి శ్రీకాంత్, కోటయ్య, జనమాల, గురవయ్య, కత్తి ధర్మయ్యలు గిరిజన నాయకులు చందమామల కోటయ్య పాఠశాలలోని విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకుని ప్రిన్సిపాల్‌తో చర్చించారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ గురుకుల పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలన్నారు.

అంబేడ్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్దాం



నారాయణవనంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం తదితరులు

నారాయణవనం, డిసెంబర్ 6(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను ముందుకు తీసుకుని వెళ్లాలని, భావితరాలకు ఆయన అనుకున్న సామాజిక న్యాయాన్ని అందించాలని సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం తెలిపారు. శుక్రవారం మండలంలో అంబేడ్కర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే ఆదిమూలం, టీడీపీ నాయకులు స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ దేశంలోని ప్రజలందరూ సమానమే అనే నానుడి తీసుకుని రావడానికి, చట్టం అందరికి ఒకటేనని చెప్పడానికి రాజ్యాంగాన్ని రచించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సత్యవేడు: స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలోని అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే ఆదిమూలం పూలమాలవేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు మునికృష్ణయ్య, వెంకటరమణ, ధనశేఖర్, రాజా, గోవిందస్వామి, కుబేంద్రన్, అరుళ్, కార్తీక్, మోహన్‌బాబు, వెంకటేశ్వర్లు, గుత్తి త్యాగరాజు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణంలో దళితులు, అధికారులు, పలు పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు శుక్రవారం అంబేడ్కర్ వర్ధంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు కూడలిలో గల అంబేడ్కర్ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ నాయకుడు డాక్టర్ బత్తెయ్యనాయుడు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటముని, నాగూరయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త తలపా దామోదర్‌రెడ్డి ఆధ్వర్యంలో కూడా ఈ వేడుకలు నిర్వహించారు.



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న డాక్టర్ బత్తెయ్యనాయుడు

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలోని బస్‌షెల్టర్‌లో అంబేడ్కర్ చిత్రపటానికి దళిత నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. పల్లమాలలో మండల టీడీపీ అధ్యక్షుడు సుధాకర్ నాయుడు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డాక్టర్ దివాకర్, సీహెచ్‌వో వెంకటేశ్వర్లు నాయకులు గెడితొట్టి గురవయ్య, కత్తి ధర్మయ్య, దేవకుమార్, దశకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేణిగుంట: పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి తెలుగుదేశం, జనసేన, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.